

నెల్లూరు బాలాజీ నగర్ అద్దాల మందిరంలో ప్రత్యేక పూజలందుకున్న సాయినాథుడు

వైభవంగా గురుపౌర్ణమి



అల్లూరులో సాయినాథుడికి నిర్వహించిన గ్రామోత్సవం



నెల్లూరు గాంధీనగర్ సాయిబాబా ఆలయంలో జరిగిన గురుపూర్ణిమ పూజల్లో పాల్గొన్న భక్తులు

జిల్లాలోని వైష్ణవాలయాల్లోనూ, సాయిబాబా మందిరాల్లో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు వైభవంగా జరిగాయి. భక్తులతో ఆలయాలన్నీ కిటకిటలాడాయి. పలుచోట్ల సామూహిక సత్యనారాయణ, సాయి వ్రతాలు, ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం పల్లకి సేవ నిర్వహించారు.

మళ్లీ తెరపైకి గోకులాలు

- పశువుల షెడ్ల నిర్మాణానికి 90 శాతం రాయితీ
- గొర్రెలు, మేకలు, కోళ్ల షెడ్లకు 70శాతం...
- పెంపకందారులకు రూ.60 వేల నుంచి 2.07 లక్షల వరకు లబ్ధి
- పాడి రైతులకు తీపికబురు



గత టీడీపీ హయాంలో కోలగట్లలో నిర్మించిన గోకులం షెడ్డు

సంగం, జూలై 21: పాడి రైతులకు, జీవాల పెంపకందారులకు రాష్ట్రంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. ఉపాధి హామీ పథకం ద్వారా రాయితీపై పశువుల, జీవాల షెడ్ల(గోకులాలు)ను మంజూరు చేయాలని నిర్ణయించింది. ఎప్పటినుంచో ఎదురుచూస్తున్న పాడి రైతులకు 90శాతం, జీవాల రైతులకు 70 శాతం రాయితీతో ఈ షెడ్లను మంజూరు చేయనుంది. నిర్మించే షెడ్డును బట్టి ఒక్కొక్క రైతులకు రూ. 60 వేల నుంచి 2.07 లక్షల వరకు లబ్ధి చేకూరనుంది. 2014-19లో టీడీపీ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఈ పథకం కింద అప్పట్లో పరిమిత సంఖ్యలో షెడ్లను మంజూరు చేసింది. ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం వీటిని మూలన పడేసింది. అప్పట్లో షెడ్డు నిర్మించుకున్న కొందరికి జగన్ ప్రభుత్వం బిల్లులు కూడా ఇవ్వలేదు.గత వైసీపీ ప్రభుత్వ హయాంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన పశుసంవర్ధక శాఖపై ప్రస్తుత టీడీపీ కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది.

పశుసంరక్షణపై దృష్టి

టీడీపీ కూటమి అధికారంలోకి రాగానే పశుసంరక్షణపై దృష్టిసారించింది. తొలినెలలోనే పాడి రైతులకు ఉపకరించే పథకాలకు శ్రీకారం చుట్టింది. పశువులతోపాటు గొర్రెలు, మేకలు, పౌల్ట్రీ షెడ్ల నిర్మాణాలు చేపట్టాలని సంకల్పించింది. అందుకు సంబంధించిన ఉత్తర్వులు కూడా ఇటీవల వెలువడ్డాయి. పశువుల షెడ్లను మూడు విభాగాలుగా విభజించారు. గరిష్ఠంగా ఆరు గేదెల కోసం నిర్మించే షెడ్లకు రూ. 2.3 లక్షలు మంజూరు చేయనున్నారు. అందులో పదిశాతం మాత్రమే లబ్ధిదారుడు చెల్లిస్తే మిగిలిన 90శాతం నిధులను ఉపాధి హామీ పథకం అనుసంధానంతో ప్రభుత్వం సమకూర్చనుంది. జీవాలకు 70 శాతం రాయితీ రైతు వాటా 30 శాతం భరించాల్సి ఉంటుంది. నాలుగు గేదెలకు అయితే రూ. 1.85 లక్షలు, రెండు గేదెలకు అయితే రూ. 1.15 లక్షలుగా యూనిట్ విలువగా నిర్ణయించారు. అదే గొర్రెలు, మేకలకు సంబంధించి 20 గొర్రెలలకు రూ. 1.30 లక్షలు, 50 గొర్రెల కోసం రూ. 2.30 లక్షలు, పౌల్ట్రీ షెడ్లకు రూ. 87 వేల నుంచి 1.32 లక్షలుగా ఒక్కో యూనిట్‌ను నిర్ణయించారు.

పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఎంపిక

గోకులాలకు లబ్ధిదారుల ఎంపిక పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. వీటి మంజూరు, నిర్మాణం ఇతరత్రా అంశాలను ఉపాధి హామీ సిబ్బందిని పర్యవేక్షించే డ్వామా పరిధిలో జరుగనున్నాయి.



దర్గా ప్రాంగణంలో భక్తుల కోలాహలం

బారా షహీద్‌లను దర్శించుకుంటున్న భక్తులు

మది నిండా భక్తితో

మళ్లీ కలుద్దాం...!

- ఇక సెలవు.. బై..బై..!
- ముగిసిన రొట్టెల పండుగ
- చివరిరోజు భారీగా భక్తుల రాక
- కల్యాణం, ఉద్యోగ రొట్టెలకు డిమాండ్
- సమష్టి కృషితో విజయవంతం

నెల్లూరు (సాంస్కృతికం) జూలై 21: మత సామరస్యానికి ప్రతీకగా నిర్వహించిన రొట్టెల పండుగ ఆదివారం రాత్రి ముగిసింది. జిల్లా నలుమూలల నుంచేకాక సుదూర ప్రాంతాల నుంచి కుటుంబాలతో తరలివచ్చిన యాత్రికులు తాము కోరుకున్న రొట్టెలను అందుకుని, భక్తితో బారాషహీద్‌లను దర్శించుకుని వెళ్లారు. కోరికలు తీరిన వారు రొట్టె వదిలి మొక్కు తీర్చుకున్నారు. పండుగలో పాల్గొన్న భక్తజనం ఆధ్యాత్మిక సుగంధంతోపాటు పర్యాటక ఆనందాలను ఆస్వాదించారు. మది నిండా భక్తిభావంతో మళ్లీ వస్తాం.. ఇక సెలవంటూ... వారివారి స్వగ్రామాలకు బయలుదేరారు. బారాషహీద్ దర్గా మైదానంలో పండుగ సందడిని, స్వర్ణాల చెరువు ఘాట్ అందాలను, బోట్‌క్లబ్‌లో బోట్ షికారు విశేషాలను తమ సెల్‌ఫోన్లలో తీపి గుర్తులుగా బంధించి తీసుకెళ్లారు. ఫుడ్ కోర్టుల్లో రకరకాల నెల్లూరు రుచులను లొట్టలేసుకుని తిన్నారు. ఐదురోజులుగా నగరపాలక సంస్థ, పోలీస్‌శాఖ, విద్యుత్, వైద్య ఆరోగ్యశాఖలు, రెడ్‌క్రాస్, మత్స్యశాఖ, అగ్నిమాపక శాఖ అధికారులు, సిబ్బంది 24 గంటలూ అప్రమత్తంగా ఉంటూ సేవలు అందించారు.



దర్గాలో సమాధుల దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

- రొట్టెల పండుగకు చివరిరోజు భారీగా భక్తులు తరలిరావడంతో దర్గా పరిసరాలు, స్వర్ణాల చెరువు ఘాట్‌లో రద్దీ నెలకొంది. ఆదివారం సెలవు కావడంతో భక్తులు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు తరలివస్తూనే ఉన్నారు. మధ్యాహ్నం రెండు గంటలపై నుంచి నగరంలోని భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో దర్గా ప్రాంతం భక్తసంద్రమైంది. వర్షం పడుతున్నా భక్తులు రొట్టెలు మార్చుకున్నారు.
- రొట్టెల పండుగకు తరలివచ్చిన భక్తులకు మూడు రోజులపాటు బెంగళూరు నుంచి వచ్చి భక్తులు, సయ్యద్‌సమీ ఆధ్వర్యంలోనూ, స్వర్ణవేదిక కల్యాణ మండపం, అచ్చుత సుబ్రహ్మణ్యం కల్యాణ మండపాల అధినేతలు ఉచితంగా అన్నదానం చేశారు.
- అత్యధికంగా యువతీ,యువకులు కల్యాణం, ఉద్యోగం రొట్టెలను పట్టుకున్నారు. తమ కోర్కెలు తీర్చాలని 12 మంది అమరవీరులను మనసారా ఆరాధించారు. తిరుగుప్రయాణంలో జిల్లాలోని కసుమూరు దర్గా, ఏఎస్ పేట దర్గాలను దర్శించుకున్నారు.
- నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆయన సతీమణి సుజిత కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం రొట్టెల పండుగలో పాల్గొన్నారు. బారాషహీద్‌లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వర్ణాల చెరువులో రొట్టెలు పట్టుకున్నారు.



ముగింపు సభలో మాట్లాడుతున్న నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, వేదికపై అజీజ్ తదితరులు

వచ్చే ఏడాది ఇంకా ఘనంగా..

రొట్టెల పండుగను వచ్చే ఏడాది ఇంకా ఘనంగా నిర్వహించుకుందామని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం రాత్రి బోట్ క్లబ్‌లో జరిగిన రొట్టెల పండుగ ముగింపుసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అందరి సహకారంతో రొట్టెల పండుగను విజయవంతం చేశామని, సుమారు 10లక్షల మందికిపైగా భక్తులకు తరలిరాగా, వారికి అన్నీ సౌకర్యాలు కల్పించామన్నారు. ఈ పండుగ విజయవంతమంతా పారిశుధ్య కార్మికులదేనన్నారు. పండుగ విజయవంతానికి మంత్రులు పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణరెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, టీడీపీ పార్లమెంటు అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్‌లు వెన్నుదన్నుగా నిలిచినందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు. సోమ, మంగళవారాల్లో కూడా రొట్టెలు పట్టుకునేందుకు వచ్చే భక్తులకు ఇలాగే అధికారులు, సిబ్బంది సేవలు అందించాలని కోరారు. దర్గా అభివృద్ధికి సీఎం చంద్రబాబు రూ.5కోట్లు మంజూరు చేసినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం భక్తులకు సేవలు అందించిన వారికి శాఖల వారీగా మెమోంటోలు అందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో దర్గా కమిటీ చైర్మన్ ఖాదర్‌బాషా, ఏఎస్పీ శ్రీనివాసరెడ్డి, అడిషనల్ కమిషనర్ శర్మద, హెల్త్ ఆఫీసర్ వెంకటరమణ, సిటీ ప్లానర్ దేవీకుమారి, కార్పొరేషన్ అధికారులు, దర్గా కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

నిధులున్నా నిర్లక్ష్యం

- మనుబోలు మండలంలో ఆగిన చెరువుల అభివృద్ధి
- జైకా కింద రూ.7 కోట్లతో పనుల ప్రారంభం
- బిల్లులు వచ్చినా వర్కులు చేయని కాంట్రాక్టర్
- మూడుసార్లు నోటీసులిచ్చినా పట్టించుకోని వైనం
- పూర్తిగా దెబ్బతిన్న కట్టలు, కల్వర్టులు, తూములు
- రాజకీయ గ్రహణంతో రైతులకు ఇక్కట్లు

నెల్లూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించలేదన్న సామెత మనుబోలు మండలం రైతులకు అచ్చుగుద్దినట్లుగా సరిపోతుంది. దెబ్బతిన్న చెరువులను రాష్ట్ర ప్రభుత్వం బాగు చేయలేని పరిస్థితుల్లో వాటి అభివృద్ధికి జైకా(జపాన్ ఇంటర్నేషనల్ కోఆపరేషన్ ఏజెన్సీ) ముందుకొచ్చింది. మండలంలోని చెరువులను అభివృద్ధి చేసేందుకు రూ.7 కోట్లు మంజూరు చేసింది. కానీ ఈ పనులకు రాజకీయ గ్రహణం పట్టింది. రెండేళ్లలో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నా ఆ గడువు ముగిసింది. అయినా ఒక్క చెరువు కూడా బాగుపడలేదు. ఇప్పటికే ఓ బిల్లును జైకా విడుదల చేసింది. నిధులు ఇచ్చేందుకు జైకా సిద్ధంగా ఉన్నా కాంట్రాక్టర్ మాత్రం పనులు కొనసాగించడం లేదు. సుమారుగా ఏడాదిపైగా పనులు నిలిపేశారు. మరో మూడు నెలల్లో వ్యవసాయ సీజన్ మొదలు కాబోతోంది. ఈ లోపు పనులు చేస్తేనే రైతులకు ఉపయోగకరంగా ఉంటుంది. కానీ ఆ పరిస్థితులు కనిపించడం లేదు. ఇరిగేషన్ అధికారులు మూడుసార్లు నోటీసులు ఇచ్చినా కాంట్రాక్టర్ స్పందించలేదు.

అత్యవసరంగా పనులు చేయాల్సి ఉన్నా..

కండలేరు రిజర్వాయర్ పరిధిలోని మనుబోలు మండలం సిస్టమ్ చెరువుల కింద సుమారు 25 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. అందులో మనుబోలు, కొలనకొదురు, లక్ష్మీనరసాపురం చెరువులు ప్రధానమైనవి. ఈ చెరువులు పూర్తిగా దెబ్బతిన్నాయి. కట్టలు బలహీనపడ్డాయి. కలుజులు దెబ్బతిని నీటి విడుదల సక్రమంగా చేయలేని దుస్థితి నెలకొంది. ఈ



దెబ్బతిన్న మనుబోలు చెరువు కలుజు

చెరువుల నుంచి కాలువల తూములు కూడా దెబ్బతిన్నాయి. కొన్ని చోట్ల కల్వర్టర్లు, బ్రిడ్జిలు కూడా కూలిపోయేలా ఉన్నాయి. ఈ చెరువులను అత్యవసరంగా బాగు చేయాలని గత టీడీపీ ప్రభుత్వంలో ప్రతిపాదించారు. జైకా నిధుల ద్వారా ఈ పనులు చేపట్టేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపింది. 2021లో మనుబోలు, కొలనకొదురు, లక్ష్మీనరసాపురం చెరువుల అభివృద్ధికి రూ.7 కోట్లు నిధులు మంజూరు చేస్తూ జైకా సంస్థ అనుమతులిచ్చింది. ఆ వెంటనే ఇరిగేషన్ అధికారులు టెండర్లు పిలిచారు. హైదరాబాద్‌కు చెందిన ఓ కాంట్రాక్టు సంస్థ ఈ చెరువుల పనులను దక్కించుకుంది. అప్పట్లో ఓ వైసీపీ నాయకుడు ఈ టెండర్‌ను వేసుకున్నట్లు ఇరిగేషన్ వర్గాల ద్వారా తెలుస్తోంది. ఆ తర్వాత సదరు నాయకుడు ఆ వర్క్‌ను మనుబోలు మండలానికి చెందిన మరో నాయకుడికి అప్పగించారు. 2022లో పనులు మొదలు పెట్టి సుమారు రూ.కోటి విలువైన వర్కులు చేశారు. ఆ బిల్లు కూడా పెట్టారు. వెంటనే బిల్లు కూడా మంజూరైంది. అయితే అసలు కాంట్రాక్టు సంస్థ పేరు మీద వర్క్ వేసుకున్న వైసీపీ నాయకుడు తన వాటా తీసుకొని మిగిలిన భాగాన్ని పని చేసిన మనుబోలు మండలం నాయకుడికి ఇచ్చారని, ఆ లెక్క సరిపోకపోవడంతో విభేదాలు వచ్చి పనులు నిలిపేశారని స్థానిక రైతులు చెప్పుకుంటున్నారు.

> **నోటీసులు ఇచ్చాం**
>
> మనుబోలు మండలంలో జైకా పనులకు సంబంధించి కొంతవరకు పనులు జరిగి ఉన్నాయి. ఒప్పందం ప్రకారం మిగిలిన పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టు సంస్థకు ఇప్పటికే నోటీసులు ఇచ్చాం. కాంట్రాక్టర్‌తో మాట్లాడుతున్నాం.. త్వరలోనే పనులు మొదలు పెట్టించి రైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం.
>
> - ఎం అనిల్‌కుమార్‌రెడ్డి, ఇరిగేషన్ డీఈ, నెల్లూరు సబ్ డివిజన్

ముగుస్తున్న ఒప్పందం

దాదాపు ఏడాదికి పైగా చెరువుల అభివృద్ధి పనుల్లో పురోగతి లేదు. అగ్రిమెంట్ ప్రకారం రెండేళ్లలో ఈ పనులు పూర్తి చేయాల్సి ఉంది. మరో రెండు రోజుల్లో అగ్రిమెంట్ గడువు కూడా ముగుస్తుంది. కానీ ఇప్పటికీ ఐదో వంతు కూడా పని జరగక పోవడం గమనార్హం. వ్యవసాయ సీజన్ మొదలైతే పనులు చేయడం సాధ్యపడదు. ఈ లోపే వీలైనంత వరకు పనులు పూర్తి చేయాలి. భారీ వర్షాలు వచ్చినప్పుడల్లా ఈ మూడు చెరువులు చాలా ప్రమాదకరంగా మారుతున్నాయి. కొలనకొదు రు చెరువు కట్ట తెగిపోయే స్థితిలో ఉంది. ఇదే జరిగితే వందల ఎకరాలు నీట మునుగుతాయి. ఈ నేపథ్యంలో పనులు చేయాలంటూ ఇరిగేషన్ అధికారులను రైతాంగం వేడుకుంటూ వస్తోంది. ఇప్పటికే ఇరిగేషన్ అధికారులు మూడు సార్లు కాంట్రాక్ట్ సంస్థకు నోటీసులు జారీ చేశారు. పనులు మొదలుపెట్టకపోతే బ్లాక్ లిస్టులో పెడతామని హెచ్చరించారు. అయినా ఇంకా పనులు మొదలు కాలేదు. ఈ విషయంలో ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి జోక్యం చేసుకొని పనులు మొదలు పెట్టించాలని రైతులు కోరుతున్నారు.



పొదలకూరులో అక్రమంగా వేసిన ఓ లేఅవుట్

200పైగా అక్రమ లేఅవుట్లు

- గుర్తించి కమిటీకి అందజేసిన అధికారులు
- తదుపరి చర్యలపై ఉత్కంఠ

నెల్లూరు (జడ్పీ), జూలై 21: జిల్లాలో అక్రమ లేఅవుట్ల గుర్తింపు కోసం అధికారులు సన్నద్ధమయ్యారు. ఈ మేరకు బృందాలుగా ఏర్పడి జిల్లావ్యాప్తంగా జల్లెడ పడుతున్నారు. లేఅవుట్లకు అనుమతులు తీసుకోకపోగా గత ప్రభుత్వంలో అధికార పార్టీ నేతలు ప్రభుత్వ స్థలాలను సైతం ఆక్రమించి, లేఅవుట్లు ఏర్పాటు చేయడం, కొన్ని లేఅవుట్లకు కనీసం కన్వర్షన్ లేకుండా పెద్దఎత్తున అక్రమాలకు పాల్పడ్డారు. దీనిపై రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ ఇటీవల రాష్ట్రస్థాయి అధికారులతో ప్రత్యేక కమిటీ చేశారు. ఆ కమిటీ సూచనల మేరకు తొలివిడతగా కడప, నెల్లూరు జిల్లాల్లో అధికార యంత్రాంగం తనిఖీలు ప్రారంభించింది. నెల్లూరు జిల్లాలో 200లకుపైగా అక్రమ లేఅవుట్లు ఉన్నట్లు గుర్తించిన అధికారులు పంచాయతీలతోపాటు కార్పొరేషన్, మున్సిపాలిటీల పరిధిలో ఉన్న అక్రమ లేఅవుట్ల జాబితాను సిద్ధం చేసి కమిటీకి అందజేసినట్లు తెలిసింది. పంచాయతీల పరిధిలో 140, నెల్లూరు కార్పొరేషన్‌తోపాటు ఆత్మకూరు, కావలి మున్సిపాలిటీల పరిధిలో 60లకుపైగా అక్రమ లే అవుట్లు ఉన్నట్లు తేలింది. విజయవాడ నుంచి జిల్లాకు చేరుకున్న కమిటీ సభ్యులు అక్రమ లేఅవుట్ల ఏర్పాటు ఎలా జరిగింది? చర్యలు ఎందుకు తీసుకోలేదు? తదితర అంశాలపై ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది. గత ప్రభుత్వంలో అధికార పార్టీ నేతల అండదండలతో జిల్లాలో ఎక్కువగా ప్రభుత్వ భూములను ఆక్రమించి, లేఅవుట్లు వేసినట్లు తేలింది. దీంతో వాటిపై కమిటీ ప్రత్యేక పరిశీలన చేస్తున్నట్లు తెలుస్తోంది. అక్రమార్కులపైన ఏమాత్రం చర్యలు చేపడతారో వేచిచూడాలి.



ఏడోసారి వచ్చాం..



మేము ఇక్కడకు వరుసగా ఏడోసారి వచ్చాం. ఆరోగ్య రొట్టె పట్టుకున్నాం. మాకు ఈ పండుగ చాలా నమ్మకం. మేము మా ప్రాంతంలో ఎంతోమందికి ఇక్కడ ప్రత్యేకతను వివరించాం. మా కుటుంబం ఈ వేడుక కోసం ఎప్పుడూ ఎదురు చూస్తూ ఉంటుంది.

- జావిద్, హైదరాబాద్

తొలిసారిగా వచ్చాం



నెల్లూరులో రొట్టెల పండుగ అంటే వినడమే కానీ, ప్రత్యక్షంగా ఎప్పుడూ చూడలేదు. ఈసారి చూద్దామని వచ్చాం. మేము అనుకున్న దానికంటే ఎక్కువ మంది భక్తులు వచ్చారు. వ్యాపారం, చదువు, పెళ్లి, ఐశ్వర్యం రొట్టెలను మా మిత్రులంతా పట్టుకున్నారు.

- కళాందర్, మిత్రబృందం, ఎమ్మిగనూరు

ఏర్పాట్లు బాగున్నాయి కానీ..



ఇక్కడ అధికారులు ఏర్పాట్లు బాగానే చేశారు కానీ... ఆహారం అనారోగ్యక రంగా ఉంది. పరిశుభ్రత లేదు. పిల్లలు ఎక్కువగా అంగళ్ల వద్ద కొని తింటుం టారు. వాటి పట్ల జాగ్రత్త లేదు. వృద్ధులకు వాహన సౌకర్యం కల్పించలేదు. చిన్నచిన్న లోపాలు తప్పిస్తే అంతా బాగుంది.

- రుక్మిణి, హైదరాబాద్

సంతానం రొట్టె పట్టుకున్నా...



సంతానం రొట్టెతోపాటు అభివృద్ధి రొట్టెను కూడా పట్టుకున్నా. ఇక్కడకు రావడం ఇది మూడోసారి. వచ్చిన ప్రతీసారి మంచే జరుగుతోంది. వివిధ ప్రాంతాల భక్తులను ఇక్కడ చూడవచ్చు. మతాలకు అతీతంగా ఈ పండుగ జరుగుతుంది.

- నజియాబ్, ధావన్‌గిరి, కర్ణాటక

-నెల్లూరు సిటీ

కసుమూరులో భక్తుల రద్దీ

వెంకటాచలం, జూలై 21: నెల్లూరు బారాషాహిద్ దర్గా వద్ద జరుగుతున్న రొట్టెల పండుగ సందర్భంగా ఆదివారం కసుమూరు మస్తాన్ వలీ దర్గాలో భక్తుల రద్దీ నెలకొంది. తమిళనాడు, కేరళ, కర్ణాటక, తెలంగాణ తదితర రాష్ట్రాలతోపాటు మన రాష్ట్ర నలుమూ లల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి మస్తాన్‌వలీ దర్గాను దర్శించుకున్నారు. దర్గా పూజారులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కసుమూరు ప్రాథమిక వైద్య ఆరోగ్య శాఖ అద్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పోలీస్ బందోబస్తు కొనసాగించారు.

పటిష్ట బందోబస్తుతో
ప్రశాంతంగా రొట్టెల పండుగ

- తప్పిపోయిన చిన్నారుల అప్పగింత
- 8000లకుపైగా వాహనాలకు పార్కింగ్



మాట్లాడుతున్న ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు(క్రైం): జూలై 21: నెల్లూరు బారాషాహీద్ దర్గా వద్ద ఐదు రోజులపాటు జరిగిన రొట్టెల పండుగ ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. దర్గా వద్ద జిల్లాతోపాటు ఇతర జిల్లాల నుంచి వచ్చిన 2000 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో పటిష్ఠమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. ఐదు రోజులుగా పోలీసులు 24 గంటల పాటు సేవలు అందించారు. ఇందుకుగాను సిబ్బంది నుంచి అధికారుల వరకు ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలుపు తున్నానని జిల్లా ఎస్పీ జీ కృష్ణకాంత్ తెలిపారు. దర్గా ప్రాంగణంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ నిఘానీడలో అన్ని విభాగాలను సమ న్వయం చేసు కుంటూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. కమాండ్ కంట్రోల్ రూమ్‌కు డ్రోన్, సీసీటీవీ పుటేజీలను అనుసంధానం చేయడం ద్వారా బందోబస్తును అనుక్షణం పరిశీలిస్తూ, రద్దీకి అనుగుణంగా సిబ్బందికి సూచనలిచ్చామన్నారు. తప్పి పోయిన 472 మంది చిన్నారులను తల్లిదండ్రుల వద్దకు చేర్చామన్నారు. వృద్ధులకు, దివ్యాంగులకు అన్ని విధాలా సహకరిస్తూ వారికి దర్శనం సజావుగా జరిగేటట్లు సేవలు అందించామన్నారు. సీసీఎస్ పోలీసు లకు 17 పిక్ పాకెట్ సెన్సెక్టలను అదుపులోకి తీసుకుని 12 పర్సులు, నగదు, దుస్తులతో ఉన్న బ్యాగ్‌లను, 2 మొబైల్ ఫోన్లను బాధితులకు అందచేశామని వివరించారు. సుమారు 8వేల కుపైగా యాత్రికుల వాహనాలను ట్రాఫిక్ సమస్య లేకుండా పార్కింగ్ చేయించామన్నారు. బాంబ్, డాగ్ స్క్వాడ్‌లతో ముమ్మర తనిఖీలు నిర్వహించామని తెలిపారు. రొట్టెల పండుగను విజయవంతం చేయడంతో సహకరించిన అన్ని ప్రభుత్వ విభాగాలు, నాయకులు, మీడియా మిత్రులకు ధన్యవాదాలు తెలుపుతునామని ఎస్పీ చెప్పారు.

25న వెంగమాంబ పేరంటాల నెల పొంగళ్లు



ప్రత్యేక అలంకరణలో వెంగమాంబ దంపతులు

దుత్తలూరు (ఉదయగిరి రూరల్), జూలై 21: నర్రవాడ వెంగమాంబ పేరంటాలమ్మ అమ్మవారి నెల పొంగళ్లు ఈనెల 25న నిర్వహించనున్నట్లు ఆలయ కార్య నిర్వాహణాధికారి వెట్టిగుంట ఉషశ్రీ ఆదివారం తెలిపారు. ప్రతి ఏడాది జరిగే బ్రహ్మోత్సవాల్లో అమ్మవారి కల్యాణం ముగిసిన నెలరోజుల అనంతరం వచ్చే మొదటి గురువారం ఈ ఉత్సవం నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేక అలంకరించి పూజలు చేస్తామన్నారు. ఈ నెల పొంగళ్ల కార్యక్రమానికి భక్తులు అధికసంఖ్యలో పాల్గొననుండంతో అన్నీ ఏర్పాట్లు చేశామన్నారు.

సోమశిలలో 9.743 టీఎంసీల నీరు నిల్వ

అనంతసాగరం, జూలై 21: సోమశిల పూర్తిస్థాయి నీటిసామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా ఆదివారానికి డ్యాం లో 9.743 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలి పారు. ఎగువ నుంచి ఎలాంటి ఇన్‌ఫ్లో రావడం లేదు. దిగు వ డెల్టాకు 200, ఉత్తర, దక్షిణ కాలువలకు 10 క్యూసె క్కులు సరఫరా చేస్తున్నారు.

మోటార్‌బైక్‌పై నుంచి పడి మహిళకు తీవ్ర గాయాలు

ఉదయగిరి రూరల్, జూలై 21: సున్నంవారిచింతల గ్రామ సమీపంలో ఆదివారం మోటార్‌బైక్‌పై నుంచి పడి మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రకాశం జిల్లా పామూరు నుంచి పఠాన్ అసియా అనే మహిళ తన కుమారుడితో కలిసి మోటార్‌బైక్‌పై ఉదయగిరికి వస్తుంది. సున్నవారిచింతల వద్దకు రాగానే ఈదురుగాలులకు ఆమె చున్నీ బైక్ టైర్‌కు చుట్టుకోవడంతో కిందపడింది. ఈ ప్రమాదంలో ఆమె తలకు తీవ్ర గాయమైంది. గమనించి న స్థానికులు 108వాహనంలో చికిత్స నిమిత్తం ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు పంపారు.



జాతీయజెండా ఐకాన్ ఏర్పాటుకు చేపడుతున్న పనులు

చురుగ్గా జాతీయజెండా ఐకాన్ ఏర్పాటు పనులు

కావలి, జూలై 21: పట్టణ ట్రంకురోడ్డులోని ఎన్టీఆర్ విగ్రహం సమీపంలో జాతీయజెండా ఐకాన్ నిర్మాణానికి పనులు చురుగ్గా జరుగుతున్నాయి. గతంలో ఈ ప్రదేశంలో పట్టణానికి తాగునీరు అందించిన అమృత్ పథకం పైలాన్ ఉండేది. వైసీపీ అధికారంలోకి రాగానే ఆ స్థలంపై వైసీపీ నేతల కన్ను పడింది. టీడీపీ పాలనలో ఏర్పాటు చేసిన అమృత్‌పైలాన్ అక్కడ కనిపించ కూడదని రాత్రికి రాత్రి దాన్ని మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి డైరెక్షన్‌లో వైసీపీ నేతలు పోలీస్, రెవెన్యూ అధికారుల సహకారంతో ధ్వంసం చేయించి తెల్లారేసరికి దాని ఆనవాళ్ల లేకుండా చేశారు. పైలాన్ ధ్వంసం చేసిన వారిపై పోలీస్‌లకు ఫిర్యాదులు చేసినా పోలీసులు ఇప్పటికీ చర్యలు చేపట్టలేదు. ఐతే విలువైన స్థలం కబ్జాకు గురి కాకూడదని ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి సొంత నిధులతో అక్కడ జాతీయజెండా ఐకాన్ నిర్మాణం చేపడతానని హామీ ఇచ్చారు. ఈ మేరకు పనులు జరుగుతున్నాయి.

పోరంబోకు భూమి..హాంఫట్!

- సర్వే నెంబర్లు మార్చేసి రిజిస్ట్రేషన్
- భూమి విలువ సుమారు రూ.50కోట్లు
- రాపూరు వాగు భూముల్లో తతంగం



రాపూరు వాగు భూముల్లో వెలసిన భవనం

రాపూరు (డక్కిలి), జూలై 21: కాదేదీ అక్కమార్కుల కనర్హం అన్నట్లు.. కొందరు అక్రమార్కులు ప్రభుత్వ భూములను స్వాహా చేసేస్తున్నారు. కళ్లముందే వాగుల్ని కబ్జాచేసి లే అవుట్లుగా తయారుచేసి ఆశపడ్డవారికి అమ్మేసి జేబులు నింపుకొంటున్నారు. వీటిని అరికట్టాల్సిన రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలు చోద్యం చూస్తున్నాయి. సర్వే నెంబర్లను మార్చేసి పక్కాగా రిజిస్ట్రేషన్ చేయించేసి రూ.50కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని హాంఫట్ అనిపించేశారు. ఇది రాపూరు పెద్ద చెరువు నుంచి వచ్చే మద్దెల మడుగు వాగు పరిధిలో జరిగింది. ఈ తతంగమంతా వైసీపీకి చెందిన భూబకాసురుల చెరలో జరిగింది. ఆ వివరాలు ఇలా ఉన్నాయి. రాపూరు నుంచి గూడూరు, నెల్లూరు, వెంకటగిరికి వెళ్లే కూడలికి సమీపంలో రాపూరు గ్రామ సర్వే నెంబరు 220ఎలో 1.14 ఎకరాల మద్దెల మడుగు వాగు పోరబోకు, సర్వే నెంబరు 220బిలో 0.37 ఎకరాలు రోడ్డు రహదారి పోరబోకు సంబందించిన ప్రభుత్వ భూమి వుంది. ఈ భూములకు మంచి డిమాండ్ ఉండటంతో భారీ యంత్రాలతో వాగులోకి మట్టిని నింపేసి లే అవుట్లు తయారు చేశారు. రిజిస్ట్రార్ కార్యాలయంలో తన పలుకుబడిని ఉపయోగించి పోరంబోకు భూమికి సమీపంలో తమకు అనుకూలమైన సెటిలిమెంటు సర్వే నెంబర్లుతో ఆశపడ్డవారికి ఓ వైసీపీ నేత విక్రయించేశారు. ఈ ప్రభుత్వ పోరంబోకు భూముల్లో సుమారు రూ 50 కోట్లుకు పైగా క్రయవిక్రయాలు నిర్వహించినట్లు సమాచారం.

ప్రశ్నార్థకంగా 2వేల ఎకరాల భూమి..

రాపూరు పెద్ద చెరువు నుంచి మద్దెల మడుగు వాగు ద్వారా సుమారు 2వేల ఎకరాల్లో రైతులు వరి సాగు చేస్తున్నారు. సుమారు వెయ్యిమందికిపైగా రైతులు జీవనాధారం పొందుతున్నారు. వైసీపీ నేత దుశ్చర్యతో రానున్న రోజుల్లో సాగు ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం పొంచి ఉందని అన్నదాతలలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాగు ఆక్రమణలకు గురికావడంతో వెలుగొండల నుంచి వచ్చే వర్షపు నీరు ముందుకు సాగలేక పైభాగంలో వున్న భూములు ముంపునకు గురి అయ్యే ప్రమాదం ఉందని రాపూరువాసులు చర్చించుకుంటున్నారు. మద్దెల మడుగు ప్రాంతంలో చోటుచేసుకొన్న ఆక్రమణలపై ఉన్నతధికారు సమగ్ర విచారణ జరిపితే మరెన్నో అక్రమాలు వెలుగులోకి వచ్చి కోట్లు రూపాయలు విలువ చేసే భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలని కోరుతున్నారు.

పట్టించుకోని సంబంధిత అధికారులు

నిత్యం ఈ మార్గం గుండానే స్థానిక రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయితీ తదితర ప్రభుత్వ ఉన్నతధికారులు రాకపోకలు సాగిస్తున్నా ఎందకనో మిన్నకుండి పోతున్నారు. ఈ వాగు పోరంబోకు భూముల్లో బహుల అంతస్థులు, వాపార సముదాయాలు, గ్యాస్ గోదాములు నిర్మించినా చూసీచూడనట్లు వెళుతు న్నారు. సదరు వైసీపీ నేతకు బయపడో లేక ఆయన ఇచ్చే ముడుపులకు ఆశపడో తెలియడం లేదన్ని ఆరోపణలు వినిపిస్తునాయి.

గాఢ నిద్రలో వెంకటాచలం పోలీసులు

- అర్ధరాత్రి ఫిర్యాదు ఇచ్చేందుకు స్టేషన్‌కు వెళ్లిన బాధితులు
- తలుపులు వేసుకొని నిద్రిస్తున్న రక్షకభటులు



వెంకటాచలం, జూలై 21: గత కొద్ది నెలలుగా వెంకటాచలం పోలీసుల పని తీరుపై అన్నివర్గాల నుండి సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మండ ల పరిధిలోని జాతీయ రహదారి వెంబడి ఉన్న గ్రామాల్లో ఇటీవల జరిగిన వరుస చోరీలు ఇందుకు నిదర్శనమని చెప్పవచ్చు. ప్రజలకు రక్షకులుగా ఉండాల్సిన పోలీ సులు రాత్రి అయితే గాఢ నిద్రలోకి వెళ్లిపోతున్నారన్న విమర్శలు బహిరంగంగానే వినిపిస్తు న్నాయి. అలాంటి పరిస్థితే శనివారం అర్ధరాత్రి ఎదురైంది. కసుమూరు గ్రామంలో శనివారం అర్ధరాత్రి యువకుల మధ్య వివాదం తలెత్తింది. ఆ వివాదం కాస్త ఘర్షణకు దారితీసి ఒక యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన యువకుడిని తీసుకొని స్నేహితు లు వెంకటాచలం సీహెచ్‌సీకి వెళ్లగా అక్కడ విధి నిర్వాహణలో ఉన్న ఆసుపత్రి సిబ్బంది యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి.. పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. దీంతో ఆ యువకులు అర్ధరాత్రి 2 గంటల ప్రాంతంలో వెంకటాచలం పోలీస్ స్టేషన్‌కు వెళ్లగా స్టేషన్ తలుపులు మూసుకొని పోలీస్ సిబ్బంది నిద్రిస్తున్నారు. సుమారు గంటకుపైగా తలుపులు తట్టినా.. అరిచినా, పోలీస్ స్టేషన్ 0861 - 2383333 ఫోన్‌కు పలుమార్లు ఫోన్ చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. గంట తరువాత మెళకువలోకి వచ్చిన సిబ్బందికి ఆ యువకులు జరిగిన విషయాన్ని చెప్పి ఫిర్యాదు చేశారు. కాగా, పోలీసుల తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమౌవుతున్నాయి. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి అర్ధరాత్రి అయినా బాధితులు పోలీస్ స్టేషన్‌కు వస్తే సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని మండల వాసులు కోరుతున్నారు.

వివాహితపై దాడి..
గొలుసు చోరీకి యత్నం

నెల్లూరు(క్రైం), జూలై 21: ఇంట్లో ఒంటరిగా ఉన్న వివాహితను గమనించిన యువకుడు ఇంట్లోకి జొరబడి ఆమెపై దాడిచేసి గొలుసు చోరీకి యత్నించాడు. బాధితురాలు పెద్దగా కేకలు వేయడంతో నిందితుడు పరారయ్యాడు. పోలీసుల సమాచారం మేరకు.. మూలాపేట అలంకార్‌పేట సమీపంలోని పెన్షన్‌లైన్‌లో మహేంద్ర, గాయత్రి దంపతులు నివాసం ఉంటున్నారు. ఈ నెల 20వ తేదీన గాయత్రి ఇంట్లో పనులు చేసుకుంటూ ఉండగా గుర్తుతెలియని యువకుడు ఇంట్లోకి ప్రవేశించాడు. గాయత్రి మెడలోని గొలుసు లాగే ప్రయత్నం చేయగా ఆమె ప్రతిఘటించడంతో ఆవేశానికి గురైన యువకుడు ఆమెపై దాడి చేశాడు. ఆమె పెద్దగా కేకలు వేయడంతో స్థానికులు రావడాన్ని గమనించిన యువకుడు అక్కడ నుంచి పరారయ్యాడు. గాయాలపాలైన ఆమెను వైద్యశాలలో చికిత్స చేయించుకొని చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు చిన్నబజారు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు ముత్తుకూరుకు చెందిన ఓ పోలీసు కుమారుడని తెలిసింది. సాంకేతికత ఆధారంగా నిందితుడిని ఆదివారం గుర్తించి బుచ్చిలో అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం.

హోరాహోరీగా ఎడ్ల బండలాగుడు పోటీలు

బిట్రగుంట జూలై 21: బిట్రగుంట ద్వారకా నగరు షిరిడీ శేషసాయి మందిర వ్యవస్థాపకుడు కుట్టుబోయిన బ్రహ్మానందరం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన అంతర్ జిల్లా ఎడ్ల బండలాగుడు పోటీలు హోరాహోరీగా జరిగాయి. ఈ పోటీలను ప్రముఖ ఆక్వా పారిశ్రామికవేత దూడల సుధాకర్ యాదవ్, జిల్లా బీజేపీ నేత గుండ్లపల్లి భరత్‌కుమార్ యాదవ్‌లు ప్రారంభించారు. అల్లూరు మండలం గోగులపల్లికి చెందిన ఎడ్లకు ప్రథమస్థానం, బుచ్చి మండలం దామరమడుగు ఎడ్లు, ద్వితీయ స్థానం, తూర్పు గోగులపల్లి ఎడ్లు మూడోస్థానంలో స్థానంలో నిలిచాయి. విజేతలకు నిర్వాహకులు నగదు, బహుమతులను అందజేశారు.

నిజాయితీ చాటుకున్న ఆర్టీసీ కండక్టర్



ప్రయాణికుడికి పర్సు అందజేస్తున్న కండక్టర్ శ్రీనివాసులు

ఉదయగిరి రూరల్, జూలై 21: స్థానిక ఆర్టీసీ డిపో కండక్టర్ కె.శ్రీనివాసులు బస్సులో ప్రయాణికుడు పోగొట్టుకున్న పర్సు అందజేసి తన నిజాయితీని చాటుకున్నాడు. వివరాల మేరకు.. ఈ నెల 17న ఉదయగిరి-నెల్లూరు బైపాస్ సర్వీసులో శ్రీనివాసులు విధులు నిర్వహిస్తున్నాడు. నెల్లూరు రంగనాయకుల పేటకు చెందిన సయ్యద్ మున్వర్‌బాషా బస్సులో నెల్లూరు నుంచి ఉదయగిరికి వచ్చాడు. బస్టాండ్‌లో ప్రయాణికులంతా దిగిపోయిన తరువాత సీటులో పర్సును కండక్టర్ గుర్తించి పరిశీలించారు. అందులో రూ.1700ల నగదు, ఏటీఎం, వాహన ఆర్‌సీ, లైసెన్సు కార్డులున్నాయి. దీంతో కండక్టర్ ఆ పర్సును డిపో మేనేజర్ శ్రీనివాసరావుకు అందజేశారు. ఆయన కార్డుల్లో ఉన్న అడ్రస్ ద్వారా ఫోన్ నెంబర్ తెలుసుకొని ప్రయాణికుడు సయ్యద్ మున్వర్‌బాషాకు సమాచారం అందజేశాడు. ఈ మేరకు ఆదివారం డిపో మేనేజర్ సమక్షంలో కండక్టర్ శ్రీనివాసులు ప్రయాణికుడికి పర్సు అందజేశాడు. ఈ సందర్భంగా కండక్టర్‌కు డిపో మేనేజర్‌తో పాటు పలువురు ఉద్యోగులు, కార్మికులు అభినందనలు తెలిపారు.

మాజీ ఎంపీపీపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు



ఎస్ఐకి ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నాయకులు

పొదలకూరు, జూలై 21: వైసీపీ నాయకుడు, మాజీ ఎంపీపీ బిరదవోలు మహేంద్రపై పొదలకూరు పట్టణ టీడీపీ అధ్యక్షుడు బొద్దులూరు మల్లికార్జున్‌నాయుడు ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ డి రామకృష్ణకి ఫిర్యాదు చేశారు. మాజీ శాసనస భ్యుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి ముఖ్య అనుచరుడు, పొదలకూరు మాజీ ఎంపీపీ బిరదవోలు మహేంద్ర పొదలకూరు మండలంలో ప్రజల మనోభావాలను దెబ్బతీస్తూ వర్గాలుగా విభజించి వారి మధ్య గొడవలు జరిగేలా చేసి శాంతిభద్రతల సమస్యలు సృష్టించి తెలుగుదేశం ప్రభుత్వానికి చెడ్డపేరు తేవాలనే కుట్రతో సోషల్ మీడియా గ్రూపుల్లో తన పేరున అసత్య ప్రచారాలతో పోస్టింగ్స్ పెడుతున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డిని అగౌరవంగా సంబోధిస్తూ అవినీతికి, అక్రమాలకు పాల్పడుతున్నట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. తగు విచారణ జరిపి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని శాంతిభద్రతలను కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పల్లారపు కృష్ణయాదవ్, బోగోలు భాస్కర్‌రెడ్డి, కలగట్ల సందీప్, కండే సురేష్‌యాదవ్, అలుపురు శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

పెనుబల్లిలో ఇరువర్గాల ఘర్షణ

బుచ్చిరెడ్డిపాళెం, జూలై 21: మండలంలోని పెనుబల్లి అరుందతీయ వాడలో ఇద్దరి మధ్య జరిగిన వివాదం రెండు వర్గాల ఘర్షణకు దారి తీసింది. ఈ ఘర్షణలో ఇరువర్గాలు రాళ్లదాడికి దిగడంతో ఓ యువకుడికి గాయాలయ్యాయి. బంధువుల కథనం మేరకు.. పెనుబల్లి అరుందతీయ వాడలోని కమ్యూనిటీహాలు వద్ద వేగూరు రవీంత్, రాజేంద్ర మధ్య శనివారం చలిమంట వేసే విషయంలో వివాదం తలెత్తింది. అనంతరం సద్దుమణగడంతో ఎవరిదారిన వారు వెళ్లారు. అయితే ఆదివారం ఈ విషయమై రవీంత్, రాజేంద్ర మధ్య మళ్లీ వివాదం రేగి ఘర్షణకు దారితీసింది. అక్కడేవున్న దాచూరు వంశీ రవీంత్‌ను వారించాడు. ఇంతలో చెరుకూటి వెంకటరమణయ్య వంశీతో ఘర్షణకు దిగాడు. దీంతో అక్కడికి వచ్చిన వంశీ తమ్ముడిని వెంకటరమణయ్య కొట్టాడు. దీంతో వంశీ తమ్ముడు (చిన్నారి)కి గాయాలయ్యాయి. ఇరువర్గాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గాయాలపాలైన వారు బుచ్చి ప్రభుత్వాసుపత్రిలో చికిత్సలు పొందారు. ఈమేరకు సీఐ హైమారావు పెనుబల్లి దళితవాడకు చేరుకుని విచారించి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు..

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	138
లేయర్ లైవ్	110
స్కిన్ చికెన్	246
స్కిన్‌లెస్	274
లేయర్	187

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.6983
వెండి కిలో ధర	రూ. 91,500
వెండి ఒక గ్రాము	రూ. 93.50

జొన్నవాడ ఆలయ ఖజానా ఖాళీ ?

- హారతి కర్పూరంలా ఆదాయం
- రికార్డుల్లో నమోదు కాని జమాఖర్చులు
- నెల నుంచి ఉద్యోగులకు అందని జీతాలు
- అనుమతులు లేకుండా అభివృద్ధి పనులు
- అక్రమాల ప్రక్షాళనకు ఎమ్మెల్యే ఆదేశం
- దేవదాయశాఖ డీసీ ఆధ్వర్యంలో విచారణ

బుచ్చిరెడ్డిపాళెం,జూలై 21: రాష్ట్రంలోనే పేరుగాంచిన జొన్నవాడ కామాక్షితాయి ఆలయంలో ఖజానా ఖాళీ అయింది. హుండీలు లెక్కిస్తేనే తప్ప ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితి ఏర్పడింది. ఐదేళ్లుగా ఆలయంలో అవసరాలకు మించి సిబ్బంది నియామకం, తలకుమించిన అనవసర ఖర్చులతో ఆదాయం హారతి కర్పూరంగా మారింది. ఈ అవినీతి, అక్రమాలపై విమర్శల నేపథ్యంలో కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి దేవదాయశాఖామంత్రి ఆనంను కొద్ది రోజుల క్రితం కలిసి చర్చించారు. జరిగిన అక్రమాలపై మంత్రి విచారణ ఆదేశించారు. ఈ క్రమంలో దేవదాయశాఖ గుంటూరు డిప్యూటీ కమిషనర్ మహేష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈనెల 14న ప్రాథమిక విచారణ చేపట్టారు. తదనంతరం గత గురువారం నుంచి శనివారం వరకు డీసీతోపాటు మాలకొండ డిప్యూటీ కమిషనర్ కే.బీ. శ్రీనివాస్, రాష్ట్ర కమిషనరేట్ సూపరింటెండెంట్, సిబ్బంది కలసి మొత్తం 8మంది రికార్డులు పరిశీలించారు. ఈ పరిశీలనలో ఐదేళ్లలో వచ్చిన ఆదాయం, జమాఖర్చులు వివరాలు, ఆలయ భూములు, ఆలయ ఉద్యోగుల నియామకం, చేసిన అభివృద్ధి పనులు, కోటికుంకుమార్చ, కుంభాభిషేకంతోపాటు దాతల విరాళాలు తదితర అంశాలను పరిశీలించి రికార్డులను స్వాధీనం చేసుకున్నారని సమాచారం. ఆలయ ఉద్యోగులు 50మందికి బదులు 75 మంది ఉండడం, సుప్రీంకోర్టు ఉత్తర్వులను గాలికొదిలేసి హారతి కానుకలను అధికార, అనధికార అర్చకులకు వదిలేయడం తదితర అంశాలపై వివరాలు నమోదు చేసుకున్నట్లు తెలిసింది. అన్ని కోణాల్లో రికార్డులు పరిశీలించిన అధికారులు రూ.కోట్ల అవినీతి జరిగినట్టు గుర్తించారని తెలిసింది. ఈ విచారణ ఇంకా పూర్తి స్థాయిలో చేపట్టనున్నట్లు సమాచారం.

మహాయజ్ఞాలు సరే... లెక్కలేవి ?

మహాయజ్ఞాల పేరుతో దాతల నుంచి రూ. కోట్లాది రూపాయల విరాళాలు సేకరించారు. పూజలు జరిగినట్టు రికార్డుల్లో వున్నా విరాళాలు, జమాఖర్చులు మాత్రం రికార్డుల్లో లేవు. ఈ విషయమై ఆలయ అధికారుల నుంచి సరైన సమాధానంలేదు. గతంలో ఆలయానికి ఏసీ(అసిస్టెంట్ కమిషనర్)హోదాలో అధికారులు వున్నప్పుడు మిగులు నిధులుగా రూ.40 నుంచి రూ. 50లక్షలు మేరకు ఉండేవని సిబ్బంది చెప్తున్నారు.ఆ తరహా అధికారులను విస్మరించడంతో ఆలయానికి ఆదాయం లేకుండా పోయిందని వారంటున్నారు.



విచారణలో భాగంగా జొన్నవాడ ఆలయంలో రికార్డులు పరిశీలిస్తున్న గుంటూరు డీసీ(ఫైల్)

అక్రమాల ప్రక్షాళనకు కంకణం

ఎంపీ, ఎమ్మెల్యే కాకముందు నుంచి వేమిరెడ్డి దంపతులు దాతలుగా సుపరిచితులు. గతంలో ఓసారి ఎవరికీ సమాచారం ఇవ్వకుండానే వారు అమ్మవారిని దర్శించుకుని ఆభరణాలపై ఆరా తీశారు. సంతృప్తి సమాధానం లేనందున తాజాగా ఆలయంలో అక్రమాల ప్రక్షాళనకు ఎమ్మెల్యే పూనుకున్నారు. కాగా అక్రమాలపై ఆలయ ఈవో శ్రీనివాసులురెడ్డిని వివరణ కోరగా విచారణపై ఉన్నతాధికారులు ఎలాంటి సమాచారం ఇవ్వలేదని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

మర్రిపాడు, జూలై 21: కంద్రిక అచ్చమాంబ ఆలయ సమీపంలోని నెల్లూరు-ముంబయి జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో కంద్రిక గ్రామానికి చెందిన కుంకు తిరుపతయ్య(36) మృతి చెందాడు. మర్రిపాడులో వ్యక్తిగత పని ముగించుకొని బైక్ పై తిరిగి ఇంటికి వెళ్తుండగా ఎదురుగా వచ్చిన కారు ఢీ కొనటంతో తిరుపతయ్యకు తీవ్ర గాయాలయ్యా యి. చికిత్స నిమిత్తం అతన్ని 108లో ఆత్మకూరు వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. నంద్యాల ప్రాంతానికి చెందిన వారు నెల్లూరులో రొట్టెల పండుగకు వెళ్లి తిరిగి కారులో స్వగ్రామానికి వెళ్తుండగా ఆదివారం ప్రమాదం జరిగింది.

శ్రీసాయి.. జయజయ సాయి !


ఆత్మకూరు: సాయి భజనలో పాల్గొన్న భక్తులు


ఆత్మకూరు: షిర్డీ సాయి మందిరంలో ప్రత్యేక అలంకరణలో సాయినాథుడు

- భక్తిశ్రద్ధలతో వేడుకలు
- సాయినాథుడికి ప్రత్యేక పూజలు, సామూహిక వ్రతాలు, హోమాలు
- భక్తులకు అన్న సంతర్పణ

ఆత్మకూరు, జూలై 21: నియోజకవర్గంలోని అన్ని సాయిబాబా మందిరాల్లో గురుపూర్ణిమ ఉత్సవాలు ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆత్మకూరు పట్టణంలోని శివాలయం ప్రాంగణంలోని షిర్డీ సాయి మందిరం, మండలంలోని మహిమలూరు, అప్పారావుపాళెం, బట్టేపాడు గ్రామాల్లోని సాయిబాబా మందిరాలలో భక్తులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ఉదయం 6 గంటలకు కాగడహారతి, అభిషేకం, సామూహిక విష్ణుసహస్రనామ పారాయ ణంతో పులకించారు. అనంతరం విశేష అలంకరణ, విశేష అర్చన, అభిషేకం కార్యక్రమాలతో పాటు భజన సత్సంగంలో పాల్గొన్నారు. మందిర కమిటీ నిర్వాహకుల ఆధ్వర్యంలో, మహిమలూరులో ఉభయదాతలు యర్రం రెడ్డి నాగ మోహన్‌రెడ్డి దంపతులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సాయినాథుని దర్శించుకుని మొక్కులు చెల్లించారు.

ఉదయగిరి: పట్టణ శివారు ప్రాంతం బీసీకాలనీ సాయిబాబా ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు కాగడ హారతి, పంచామృతాభిషేకాలు, శాంతిహోమాలు చేపట్టారు. అనంతనం సాయిబాబా పల్లకీసేవ, గానకచేరి నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానికులే కాకుండా చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

వింజమూరు: స్థానిక సాయిబాబా మందిరంలో వేడుకలు నిర్వహించారు. స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక హారతులు ఇచ్చారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు.

సంగం: స్థానిక ఆలయంలోని షిరిడి సాయిబాబాకు భక్తిశ్రద్ధలతో ఉచిత సామూహిక సాయి సత్యవ్రతం నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం పల్లకీసేవ చేపట్టారు. వెంగారెడ్డిపాళెం ఆలయంలో నిర్మాణ దాతలు ఆనం ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో అభిషేకాలు, కాగడ హారతి, హోమం, సాయికీర్తనలు, సాయంత్రం పల్లకీసేవ నిర్వహించారు.

వరికుంటపాడు: స్థానిక బస్టాండ్ సెంటర్ సమీపంలోని సాయిబాబా ఆలయంలో స్వామివారిని ప్రత్యేకంగా ముస్తాబు చేసి హారతులు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. సాయంత్రం చేపట్టిన పల్లకీసేవలో భక్తులు పాల్గొన్నారు. భక్తుల సౌకర్యార్థం అన్నదానం చేశారు.

సీతారామపురం: స్థానిక పంచాయతీలోని బాలత్రిపుర సుందరి ఆశ్రమంలో ఆశ్రమ ధర్మకర్త నన్నయబట్టు శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో భక్తులు గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించారు. స్వామి వారికి తెల్లవారుజాము నుంచే పంచామృత అభిషేకాలు, శ్రీ బాల త్రిపుర సుందరి అమ్మవారికి మహిళలతో కుంకుమ పూజ చేపట్టారు. అనంతరం భక్తులకు మధ్యాహ్నం అన్నదానకార్యక్రమం నిర్వహించారు.

చేజర్ల: కోటితీర్థం గ్రామంలోని సాయి మందిరంలో తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. మధ్యాహ్నం గురజాల శ్రీని వాస్, శ్రావ్య, రియాన్షిక ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు.


సంగం: సామూహిక సాయి సత్యవ్రతంలో పాల్గొన్న మహిళలు


ఉదయగిరి: పూజలు నిర్వహిస్తున్న భక్తులు

- భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి వేడుకలు
- కావలి శ్రీసాయి క్షేత్రంలో వస్త్రదానం, సాయినామ సంకీర్తన, భజనలు

సాయి శరణం.. బాబా శరణం..


కావలి: శ్రీసాయి క్షేత్రంలో సేవలందుకుంటున్న సాయినాథుడు


కొండాపురం: ప్రత్యేక అలంకరణలో సాయిబాబా

కావలి టౌన్, జూలై 21: గురుపౌర్ణమి వేడుకలు ఆదివారం పట్టణంలో భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముసునూరు మందాటి చెరువు వద్ద నున్న శ్రీసాయి క్షేత్రంలో శ్రీసాయి సర్వీస్ సొసైటీ సభ్యులు ఉదయం కాగడ హారతితో పూజలు ప్రారంభించారు. అనంతరం 108కలశాలతో మూలవిరాట్టుకు అభిషేకాలు చేశారు. అనంతరం వరసిద్ధి గణపతి, సుబ్రమణ్యేశ్వర, ఆంజనేయస్వాములకు చందనాలంకారములు గావించారు. ఆలయ ప్రాంగణంలో బిట్రగుంట విజయగణపతి భజన సం ఘం సభ్యులు సాయినామ సంకీర్తన, భజనలతో అలరించారు. మధ్యాహ్నం పెద్దఎత్తున భక్తజనానికి అన్నసంతర్పణ, పేదలకు వస్త్రదానం చేశారు. కార్యక్ర మంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు నాగేశ్వరరావు ధన్యవాదా లు, సంఘం సభ్యులు పాల్గొన్నారు. ఆర్టీసీ డిపో వెనుకనున్న నంద దీప్ సాయిసమాజ్ ఆలయంలో వేడుకలు పెద్దఎత్తున జరిగాయి. భక్తులకు అన్నసంతర్పణ గావించారు. పాతూరు బాబా మందిరంలో వెంగళరావునగర్ మందిరంలో, వెం గాయగారిపాలెం రోడ్డు మందిరంలో వేడుకలు జరిగాయి.


కలిగిరిలోని సాయిబాబా ఆలయంలో భక్తుల పూజలు

కొండాపురం: కొమ్మి గ్రామంలో ఉన్న సాయిబాబా ఆలయం వద్ద భక్త లు విశేష పూజలు చేశారు. అలాగే లింగసముద్రం మండలం పెద్దపవని సాయిబాబా ఆలయం వద్దకు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాల వద్ద నిర్వాహకులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

జలదంకి: స్థానిక బ్రాహ్మణక్రాక సాయి మందిరంలో భక్తులు పూజలు నిర్వహించారు. జరిగాయి. మండలంలోని పలు ఆలయాల్లో జరిగిన ఈ వేడుకలు ఘనంగా జరిగాయి.

కలిగిరి: స్థానిక షిర్డీసాయిబాబా ఆలయంలో వేద పండితులు పున్నవజ్జుల శేషసాయి ఆధ్వర్యంలో ఆలయంలో పాలాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయి నామస్మరణతో భక్తులు స్వామిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. సోమవారం విశేషపు ష్పాలంకరణతో స్వామికి గ్రామోత్సవం, చిన్నారులతో కోలాటం, భజన కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

బిట్రగుంట: బోగోలు, విశ్వనాథరావుపేట, రైల్వే కాలనీ, పాతబిట్రగుంట, ద్వారకా నగరులోని సాయి మందిరాల్లో తెల్లవారు జామునుంచి బాబాకు అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ప్రవాసభారతీయులు బచ్చు కృష్ణకుమార్ సంధ్య దంపతులు పాల్గొన్నారు. పల్లకీ సేవ, రాత్రి షిరిడి సాయినాథున్ని గ్రామోత్సవం వైభవంగా జరిగింది.

కావలి రూరల్: మండలంలోని గ్రామాల్లో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిబాబా ఆలయాలను విద్యుత్ దీపాలు, పచ్చతోరణాలతో అలంకరించి ముస్తాబు చేశారు. ఆలయాల ప్రాంగణంలో అన్నసంతర్పణ కార్యక్రమాలు నిర్వహించారు.

అల్లూరు: అల్లూరు పేటలోని సాయినాథుని ఆలయం, శివాలయంలోని దత్తసాయి మం దిరం కలుగోళమ్మ వీధి, తూర్పు వీధిలోని సాయినాథుని ఆలయాల్లో ప్రభాత దర్శనం, కాకడ హారతి, పాలాభిషేకం, పూలంగిసేవ, లక్ష మల్లెల పూజ, హారతిని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అన్ని ఆలయాల వద్ద అన్నదానం చేపట్టారు. కలుగోళమ్మ వీధిలో సాయినాథుడిని అలంకరించి ప్రత్యేక వాహనంలో ఊరేగించారు.


కావలి: సాయినాథుడిని దర్శించుకుంటున్న భక్తులు

లింగసముద్రం, జూలై 21: మండలంలోని పలు గ్రామాలలోని షిరీడీ సాయిబాబా ఆలయాల్లో ఆదివారం గురుపౌర్ణమి మహోత్సవం వైభవంగా జరిగింది. మండలంలోని చినపవని, పెద పవని, మొగిలిచెర్లలోని దత్తా త్రేయస్వామి ఆలయం, లింగ సముద్రం, వీఆర్‌కోట తదితర గ్రామాల్లోని సాయిబాబా ఆలయాల్లో భక్తులు పూజలు చేశారు. పెదపవనిలోని సాయిబాబా ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.



ప్రశాంతత పెరిగేకొద్దీ విజయాలు, శక్తిసామర్థ్యాలు


ఆత్మకూరులో శాఖాహార ర్యాలీ నిర్వహిస్తున్న ధ్యాన సాధకులు, పిరమిడ్ మాస్టర్లు

ఆత్మకూరు, జూలై 21: మనిషిలో ప్రశాంతత పెరిగేకొద్దీ అతని విజయాలు, శక్తి సామర్థ్యాలు పెరుగుతాయని సీనియర్ పిరమిడ్ మాసర్లు డాక్టర్ సుబ్రహ్మణ్యం, శివకుమారెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక షిర్డీసాయి పిరమిడ్ కేంద్రంలో గురు పౌర్ణమి సందర్భంగా ధ్యాన- జ్ఞాన శిక్షణా తరగతులు, సజ్జన సాంగత్యం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ధ్యానం, సజ్జన సాంగత్యం, స్వాధ్యాయం ప్రాముఖ్యతను వివరించారు. మనశ్శాంతి పొందాలంటే మనసును సాత్వికగుణంలో ఉంచుకోవాలని, అందుకు ధ్యానం ఒక్కటే మార్గమని తెలిపారు. ధ్యానంతో బుద్ధిబలం పెరగడంతో పాటు శరీరంలో నాడిశుద్ధి జరిగి రోగాలు దూరమవుతాయన్నారు. ధ్యాన సాధకులు సజ్జనసాంగత్యంతో పాటు ఆత్మవిజ్ఞాన పుస్తకాలు చదవాలన్నారు. సంపూర్ణ ఆరోగ్యానికి శాఖాహారం మేలన్నారు. మితిమీరిన వ్యామోహం, మమకారం మనశ్శాంతి లేకుండా చేస్తాయన్నారు. ఎప్పటికప్పుడు పాత ఆలోచలను, నమ్మకాలను విడిచిపెట్టినపుడే మార్పు సాధ్యపడుతుందన్నారు. చివరిగా ధ్యానసాధకులు, పిరమిడ్ మాస్టర్లతో కలిసి పట్టణ వీధుల్లో శాఖాహార ర్యాలీ నిర్వహించారు. మాస్టర్లు చంద్రా విజయ, ఎం.వెంకటేశ్వర్లురెడ్డి పాల్గొన్నారు.

రేవూరులో ఉచిత వైద్యశిబిరం


మహిళను పరీక్షిస్తున్న వైద్యులు

అనంతసాగరం, జూలై 21: రేవూరు ఉన్నత పాఠశాలలో ఆదివారం నెల్లూరు ఎనెల్ ఆసుపత్రి నిర్వాహకులు ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు నాగేంద్రప్రసాద్, లావణ్య, దావూద్ తదితరులు పాల్గొన్నారు.

సోమశిలలో ప్రమాదకర సెల్ఫీలు



జలాశయ దిగువ ప్రాంతంలో యువకులు

అనంతసాగరం, జూలై 21: సోమశిల జలాశయ ప్రమాదకర ప్రాంతాల్లో అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో యువత సంచరిస్తున్నారు. డ్యాం దిగువ ప్రాంతం నీటి ప్రవాహం కొనసాగే చోట సెల్ఫీలు తీసు కునేందుకు కొందరు ఉత్సాహం చూపుతున్నారు. ఆ ప్రాం తం పాచి పట్టి జారుతోంది. అక్కడకు చేరుకొని యవకులు కేరింతలు కొడుతూ సెల్ఫీలు, రీల్స్ తీస్తున్నారు. ఏమాత్రం ఆదమరిస్తే సుడిగుండంలో పడిపోయే ప్రమాదం ఉంది.

చెన్నకేశవుడికి వైభవంగా గరుడసేవ

సంగం, జూలై 21: మర్రిపాడు శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవ స్వామి శనివారం అర్ధరాత్రి గరుడవాహనసేవలో భక్తులకు దర్శన మిచ్చారు. గ్రామోత్సవంలో భక్తులు కర్పూర హారతులతో స్వాగతం పలికి మొక్కులు తీర్చుకున్నారు.


గరుడవాహనంపై చెన్నకేశవస్వామి


గంగమ్మతల్లి

శాకాంబరి అలంకరణ

ఆషాఢమాసం గురుపౌర్ణమి సందర్భంగా పెన్నానది సమీపంలో వెలసిన గంగమ్మదేవి శాకాంబరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమానికి ధనింకుల సుధాకర్, సుష్మిత దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

పొలాలకు పచ్చి ఎరువులు


పశువుల పేడను ట్రాక్టర్లలో పొలాలకు తరలిస్తున్న దృశ్యం

ఉదయగిరి, జూలై 21: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ పంటల సాగునకు రైతులు సన్నద్ధం అవుతున్నారు. అందులో భాగంగా పొలాలను దుక్కులు చేసి సహజసిద్ధమైన పశువుల ఎరువును ట్రాక్టర్లతో పంట పొలాల్లోకి తరలిస్తున్నారు. గన్నేపల్లి, బిజ్జంపల్లి, కొండాయపాళెం, తిరుమలాపురం, అప్ప సముద్రం గ్రామాల్లో వరినాట్లు చేసేందుకు సిద్ధమయ్యారు.

విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు

ఉదయగిరి, జూలై 21: ఉదయగిరి దుర్గంపై అక్రమ మద్యం అమ్మకాలు విచ్చలవిడిగా జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానిక మహిళలు వాపోతున్నా రు. దుర్గంపై పలువురు ఉదయం, సాయంత్రం అనే తేడా లేకుండా బాటిల్‌పై రూ.50లు అధికంగా ఆటోలో తెచ్చి విక్రయిస్తున్నట్లు సమాచారం. మద్యం విక్రయాలతో నివాసాల్లో నిత్యం వివాదాలు తలెత్తుతున్నాయని, అధికారులు స్పందించి మద్యం విక్రయాలను అరికట్టాలని కోరుతున్నారు.

వింజమూరు: మండలంలో విచ్చలవిడిగా మద్యం బెల్టుషాపులు వెలిశాయి. కూల్‌డ్రింక్ షాపులు దగ్గర బెల్టు షాపులను నిర్వహిస్తున్నారు. పట్టణంలో ఆర్టీసీ రోడ్డు సమీపంలోని కూల్‌డ్రింక్ షాపుల్లో ఉదయం 5గంటల నుంచి ప్రభుత్వ షాపు తెరిచే వరకు మద్యాన్ని అధిక రేట్లుకు అమ్ముతూ ఆదాయాన్ని పొందుతున్నారు. పల్లెల్లో ఈ బెల్టుషాపులతో అసాంఘిక కార్యక్రమాలు ఎక్కువవుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. అధికారులు పట్టించుకోక పోవడం వల్లే ఈ పరిస్థితి నెలకొందని స్థానికులు చర్చించుకుంటున్నారు.

బాధితుడికి ఆర్థిక సాయం

వింజమూరు, జూలై 21: స్థానిక సుజాతనగర్ కాలనీకి చెందిన సయ్యద్ ఇలియాజ్ జీవనాధారం కోసం అద్దాల పనికి వెళ్లి ప్రమాదవశాత్తు మెడకు తీవ్ర గాయాలై చెన్నై ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న గడ్డం పకీరయ్య, అతని మిత్ర బృందం రూ.15వేలు ఆర్థికసాయం అందజేశారు.

కనుల పండువగా హనుమాన్ శోభాయాత్ర

- అంజనీపుత్రుడి నామస్మరణతో మార్మోగిన పురవీధులు
- రెపరెపలాడిన కాషాయ జెండాలు
- వేలాదిగా తరలివచ్చిన భక్తులు


శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

ఆత్మకూరు, జూలై 21: పట్టణంలో ఆదివారం చేపట్టిన హనుమాన్‌శోభా యాత్ర భక్తుల మధ్య కనుల పండువగా జరిగింది. పట్టణంతో పాటు పలు ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు పాల్గొని జై హనుమాన్ నామ స్మరణ చేయడంతో వీధులన్నీ మార్మోగాయి. పురవీధుల్లో కాషాయ జెండాలు రెప రెపలాడాయి. ఈ యాత్రలో పురప్రముఖులు, పలు పార్టీల నేతలు, యువతతో పాటు చిన్నారులు సైతం ఉత్సాహంగా పాల్గొన్నారు. మధ్యాహ్నం 3గంటల నుంచి బైపాస్‌రోడ్డులోని అభయాంజనేయస్వామి ఆలయం నుంచి శోభాయాత్ర ప్రారంభమైంది. రవితేజ కళ్యాణ మండపం, పాత సినిమాహాలు మీదుగా వైశ్యబజార్, సత్రంసెంటర్, చావిడి సెంటర్, హిల్‌రోడ్, ఎరుకల సానినగర్, సోమశిలరోడ్డు సెంటర్, ఎల్‌ఆర్‌పల్లి, పోలీస్‌స్టేషన్, ఆర్టీసీ డిపో వ రకు కొన సాగింది. అక్కడి నుంచి తిరిగి మెయిన్‌బజార్ మీదుగా మున్సిపల్ బస్టాండ్, అరుంధతీయ కాలనీ మీదుగా రవితేజ కళ్యాణ మండపం వద్దకు చేరుకుంది. తొలుత అభయాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సీతారామలక్ష్మణ, హనుమంతుల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి ప్రత్యేక వాహనంపై కొలువుదీర్చి యాత్రను ప్రారంభించారు. భక్తులు మోటారు బైక్‌లపై శోభా యాత్రలో పాల్గొన్నారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులకు సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కంచి పరమేశ్వర రెడ్డి అన్నద వితరణ చేపట్టారు.

జీవో నెంబర్ 117ను రద్దు చేయాలి

- యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు
- మంత్రి లోకేష్ హామీలు అమలు చేయాలి


మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

కావలి టౌన్, జూలై 21: ప్రభుత్వ విద్యారంగాన్ని బతికించుకుందామని ఆ బాధ్యత ఉపాధ్యాయులు ప్రభుత్వంపై వుందని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం స్థానిక ఎంజీఆర్ కల్యాణమండపంలో సంఘం జిల్లా మధ్యంతర సమావేశం జిల్లా అధ్యక్షుడు వీవీ శేషులు అధ్యతన జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వ వైఖరితో రాష్ట్రంలో 4లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చేరకుండా ప్రైవేట్ పాఠశాలలో చేరారని ఆవేదన వ్యక్తం చేశారు. జీవో నెంబర్ 117ను రద్దు చేయాలని ప్రభుత్వ విద్యకు పునాది అయిన ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేయాలని కోరారు. విద్యాశాఖ మంత్రి లోకేష్ పాదయాత్రలో ఇచ్చిన హామీలు అమలు చేసి మాట నిలబెట్టుకోవాలన్నారు. ఎస్‌సీఈఆర్‌టీని మరుగుపర్చి ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్ ప్రవేశపెట్టడం సరికాదన్నారు. రాష్ట్ర కార్యదర్శి నవకోటేశ్వరరావు మాట్లాడుతూ ప్లస్-2 పాఠశాలలకు పర్మినెంట్ అధ్యాపకులను నియమించాలని, 2003డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని, బోధనేతర కార్యక్రమాలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నేతలు చలపతిశర్మ, శ్రీదేవి, కిలారి వెంకటేశ్వర్లు, అచ్చన్న, మురళీధరరావు, మాధవ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత


మొక్కలు నాటుతున్న డిజిటల్ అసిస్టెంట్ శ్యాంసుధాకర్

బిట్రగుంట, జూలై 21: పర్యావరణాన్ని కాపాడం ప్రతిఒక్కరి బాధ్యత అని కోవూరుపల్లి డిజిటల్ అసిస్టెంట్ మర్రి శ్యాంసుధాకర్ అన్నారు. బిట్రగుంట రైల్వే ఫుట్‌బాల్ క్రీడామైదానంలో ఆయన క్రీడాకారులకు పౌష్టికాహారం పంపిణీతో పాటు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా బిట్రగుంట వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.స్పర్జన్‌రాజ్, గౌరవాధ్యక్షుడు ఎస్ఎస్.యాదవ్ మాట్లాడారు. వాకర్స్ అసోసియేషన్ స్నేహభావాలకు ప్రతీక అన్నారు. ఆగస్టు 4న నిర్వహించనున్న 3కే రన్‌ను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఫౌండర్ అధ్యక్షుడు కే.శ్రీనివాసులు, అసోసియేషన్ కమిటీ సభ్యులు ఉన్నారు.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఇంటూరికి ఘన సన్మానం


ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావును ప్రత్యేక రథంపై ఊరేగిస్తున్న ఆర్యవైశ్యులు

కందుకూరు, జూలై 21: కందుకూరు పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావును ఆదివారం రాత్రి ఘనంగా సత్కరించారు. ముందుగా పొట్టిశ్రీరాములు విగ్రహం నుంచి వాసవి గ్రంథాలయం వరకు నాగేశ్వరరావును ప్రత్యేక రథంపై ఊరేగింపుగా తీసుకెళ్లారు. అనంతరం వాసవి కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో ఆర్యవైశ్యులు ఎమ్మెల్యే నాగేశ్వరరావుని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ పట్టణంలో ప్రశాంత వాతావరణం ఉండేలా చూడటంతోపాటు ఆర్యవైశ్యులు స్వేచ్ఛగా తమ వ్యాపారాలు చేసుకునేలా చూసే బాధ్యత తనదని అభయం ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య ప్రముఖులు కోట నరసింహం, పీ పిచ్చయ్య, వేణు, రామారావు, గుర్రం సింగయ్య, మురారిశెట్టి వెంకటసుబ్బారావు, కోట వెంకటేశ్వర్లు తదితర ఆర్యవైశ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

తెలుగుభాషను పాలనాభాషగా అమలుచేయాలి

- లోక్‌సత్తా ఉద్యమ సంస్థ నేత మాలకొండారెడ్డి

జలదంకి, జూలై 21: రాష్ట్ర ప్రభుత్వం అన్నిశాఖల పాలనాభాషగా అమలు చేయాలని లోక్‌సత్తా ఉద్యమ సంస్థ సమన్వయకమిటీ సభ్యుడు ముదిగండ్ల మాలకొండా రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం జలదంకిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రాథమికవిద్యను మాతృభాషలో కనీసం 30శాతం అభ్యసించకుంటే అది మృతుభాషగా మారుతుందని యునెస్కో హెచ్చరించిందన్నారు. జిల్లాలో అధికార భాష శాఖలు ఏర్పాటు చేసి తీరుతెన్నులపై పరిశీలించాలని కోరారు. తెలుగు వ్యవహారిక పితామహుడు గిడుగు రామ్మూర్తి పంతులును స్ఫూర్తిగా తీసుకుని భాషా పరిరక్షణకు తెలుగు అధికారభాషా సంఘం పత్యేక చర్యలు తీసుకోవాలన్నారు.

విద్యా ప్రదాత డీఆర్

- నిరుపేదలకు నిత్యావసరాల పంపిణీ


వృద్ధురాలికి నగదు, నిత్యావసరాలు అందజేస్తున్న సురేంద్ర రెడ్డి

కావలి, జూలై 21: విశ్వోదయ వ్యవస్థాపకుడు దొడ్ల రామచంద్రారెడ్డి (డీఆర్) విద్యాప్రదాత, దార్శనికుడని సమాజానికి ఆయన అందించిన సేవలు అమూల్యమైనవని కావలి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాటా సురేంద్ర రెడ్డి కొనియాడారు. డీఆర్ విశ్వోదయ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం సమితి కార్యాలయంలో 60మంది పేద వృద్ధులకు నిత్యావసర సరుకులు, బియ్యం, నగదు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సురేంద్రరెడ్డి మాట్లాడారు. డీఆర్ స్ఫూర్తితో వారి కుమారులు వినయకుమార్‌రెడ్డి, విద్యాధర్‌రెడ్డిలు తమ విద్యాసంస్థల ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహించటం అభినందనీయమన్నారు. విశ్వోదయ రెక్టార్ దొడ్ల వినయకుమార్‌రెడ్డి, సేవా సమితి చైర్‌పర్సన్ దొడ్ల లక్ష్మీ, డైరెక్టర్ తాతిరెడ్డి,సభ్యులు నల్లూరు రామక్రిష్ణ, సతీష్‌సింగ్, రంగనాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రామసభలు

అల్లూరు, జూలై 21 : మండలంలోని 10గ్రామ పంచాయతీల్లో సోమవారం నుంచి గ్రామసభలు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ జ్యోతి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం బీరంగుంట, ఇందుపూరు, పురిణిలలో, 23న తూర్పు గోగులపల్లి, పడమర గోగులపల్లి, గ్రద్దగుంట, 24న బట్రకాగొల్లు, ఇస్కపల్లి, నార్తుఆములూరు, వెలిచర్ల సభలు జరుగుతాయన్నారు. సభలకు అన్ని శాఖల మండలాధికారులు, సచివాయల సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొనాలన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యల, అభివృద్ధి పనులపై గ్రామస్తులతో చర్చించన్నుట్టు ఆమె తెలిపారు.

న్యూరాలజీ ఉచిత వైద్యశిబిరం

బిట్రగుంట, జూలై 21: బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీలోని రామస్వామిపాలెం విఘ్నేశ్వర రామలింగేశ్వర ఆలయ ప్రాంగణంలో హ్యూమన్ రైట్స్, జైభీం అంబేడ్కర్ సేవాదళ్ సంయుక్తంగా ఆదివారం ఉచిత న్యూరాలజి వైద్యశిబిరం నిర్వహించారు. ప్రముఖ న్యూరాలజీ వైద్యులు బిందుమీనన్, సిబ్బంది గ్రామస్థులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచు గండూరి మంజుల, అంబేడ్కర్ సేవాదళ్ అధ్యక్షుడు బత్తుల రవిచంద్ర, జిల్లా హ్యూమెన్ రైట్స్ ఛీఫ్ దాసరి సునీల్, సభ్యులు షేక్ నూరుద్దీన్, ఎం.సురేష్, తిరుమల ఉన్నారు.

నెల్లూరు సిటీ, రూరల్ కోవూరు, సర్వేపల్లి

వైభవంగా గురుపౌర్ణమి

● సాయినామ స్మరణతో మారుమోగిన మందిరాలు ● బారులు తీరిన భక్తులు



నెల్లూరు చిల్డ్రన్స్‌పార్కు వద్ద సాయిబాబా మందిరంలో పూజలు అందుకున్న సాయినాథుడు



నెల్లూరులో సామూహిక సత్యనారాయణ వ్రతం



వెంకటాచలం : సత్యనారాయణవ్రతం నిర్వహిస్తున్న అర్చకుడు

నెల్లూరు(సాంస్కృతికం), జూలై 21: వైష్ణవ ఆలయాల్లో వ్యాస పౌర్ణమి, సాయి మందిరాల్లో గురుపౌర్ణమి వేడుకలు ఆదివారం వైభవంగా జరిగాయి. భక్తులతో కిటకిటలాడాయి. తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో విశేష పూజలు జరిగాయి. అలవందార్ జన్మనక్షత్రం సందర్భంగా శ్రీదేవి భూదేవి తల్పగిరి రంగనాథస్వామి, అవలదొర్ల విశేష తిరుమంజనం అలంకారం, పూజలు, నివేదనలు జరిగాయి. సాయంత్రం రంగనాథస్వామికి (గజేంద్ర మోక్షం) గోపురోత్సవం కనుల పండువగా జరిగింది. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలను ఆలయ చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, ఈవో ఏవీ శ్రీనివాసులరెడ్డి పర్యవేక్షించారు.



నెల్లూరు : గోపురోత్సవంలో రంగనాథుడు

● సత్యనారాయణ వ్రతం

మహాత్మాగాంధీనగర్ కృష్ణమందిరంలో సామూహిక సత్యనారాయణ వ్రతం కనుల పండువగా జరిగింది. ఆలయ అర్చకులు బీశ్రీనివాసులు భక్తులతో వ్రతం చేయించారు. అనంతరం మహానివేదన, మంగళహారతులు, ప్రసాద వితరణలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ఉభయ కర్తలు, ధర్మకర్తలు పాల్గొన్నారు. అలాగే పలు ఆలయాల్లో వ్యాస పౌర్ణమి వేడుకలు జరిగాయి.

● నగరంలోని ట్రంకురోడ్డు షిరిడీ సాయిబాబా మందిరంలో ఉదయం షిరిడీ హారతి, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, భక్తుల నామగోత్రాలతో పూజలు జరిగాయి. అనంతరం పంచామృతాభిషేకం, వివిధ సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు జరిగాయి. సామూహిక సహస్ర నామ పూజలు, హారతులు, మంత్రపుష్పాలు, ప్రసాద వితరణలు చేపట్టారు. సాయంత్రం మూలవిరాట్, సాయిమందిరం అంతా విశేష పుష్పాలంకారం భక్తులు విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం ప్రత్యేక పల్లకీసేవ, గురుకృపా కళాక్షేత్రం చిన్నారులచే నృత్య విభావరి భక్తులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమాలను మందిరం చైర్మన్ మన్నెం అమరనాథ్‌రెడ్డి, సభ్యులు కొల్లి శ్యామసుందర్‌రెడ్డి, తదితరుల పర్యవేక్షించారు.

● బాలాజీనగర్ పద్మావతినగర్‌లోని సాయిదర్బార్‌లో గురుపౌర్ణమి వేడుకలు కనుల పండువగా జరిగాయి. ఉదయం 5 గంటలకు కాకడహారతి, 6గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు ఓంసాయి శ్రీసాయి, జయజయ సాయి నామస్మరణల మధ్య అభిషేకాలు జరిగాయి. మధ్యాహ్నం భారీ అన్నదానం, మధ్యాహ్నం హారతి, సాయంత్రం సంధ్యాహారతి, సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం, పండరి భజనలు, కోలాటాలు జరిగాయి. రాత్రి ఊంజల్‌సేవ, అనంతరం పవళింపు సేవలు జరిగాయి. ఈ కార్యక్రమాలు ధర్మకర్త మధుసాయి ఆధ్వర్యంలో జరిగాయి. అలాగే లక్ష్మీపురం షిరిడీసాయి మందిరం, చిల్డ్రన్స్‌పార్కు సాయి సదన్, అయ్యప్పగుడి సాయిమందిరం, నిప్పో సెంటర్ సాయిమందిరం, చైతన్యపురి కాలనీ, కావేరినగర్ సాయిమందిరం, శ్రామికనగర్, బాలాజీనగర్ సాయిమందిరాల్లో గురుపౌర్ణమి వేడుకలు వైభవంగా జరిగాయి.

వెంకటాచలం : మండలంలోని గొలగమూడిలో ఉన్న గురుధ్యాన నిలయంలో ఆదివా రం గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహిం చారు. సాయినాథునికి, వెంకయ్యస్వామికి, దత్త ప్రభువులకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహిం చారు. అనంతరం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాన్ని నిర్వహించి అన్నప్రసాదాలు వితరణ చేశారు. కార్యక్రమాలను గురుధ్యాన నిలయం నిర్వాహకులు శేఖర్‌నాయుడు, సిబ్బం ది తదితరుల పర్యవేక్షణలో జరిగాయి.



సైదాపురం : కలిచేడులో విశేష అలంకరణలో సాయిబాబా

పొదలకూరు : పట్టణంలోని షిరిడీ సాయిబాబా మందిరంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే ధుని పూజలు జరిపారు. పొదలకూరు మండల టీడీపీ అధ్యక్షుడు తలచీరు మస్తాన్‌బాబు, మమత దంపతులు ఉదయం ఓంకార ప్రణవ పతాకావిష్కరణ గావించారు. అనంతరం సామూహిక సాయి సత్యవ్రతం భక్తిశ్రద్ధలతో చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం సామూహిక అష్టోత్తర పూజలు, సాయం సంధ్యా హారతి, శ్రీవిష్ణు సహస్ర నామ స్తోత్రాలను నిర్వహించారు. అనంతరం కడప జిల్లా మైదుకూరుకు చెందిన ప్రసన్న సీతారామ ఈవెంట్స్ ఆధ్వర్యంలో ప్రదర్శించిన జానపద నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో షిరిడీ సాయి సేవా సమితి సొసైటీ అధ్యక్షుడు చీమకుర్తి రాజగోపాల్, కార్యదర్శి నాగిశెట్టి దామోదర్‌రావు, ఉప కార్యదర్శి తరుగు ప్రభాకర్, కోశాధికారి పంగులూరు సుబ్బానాయుడు, సభ్యులు లక్కాకుల ఆనందరావు, తదితరులు పాల్గొన్నారు.

తోటపల్లిగూడూరు : మండలంలో కొత్తపాలెం గ్రామంలో శ్రీదత్తసాయిబాబా ఆలయంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు ప్రసాద్‌స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. మధ్యాహ్నం సుమారు 300 మంది భక్తులకు అన్నప్రసాదం పెట్టారు. ఈ కార్యక్రమంలో కొత్తపాలెం సాయిబాబా భక్త బృందం పాల్గొన్నారు.

కోవూరు : మండల పరిధిలోని గ్రామాల్లో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక జాతీయ రహదారి పక్క నున్న సాయిబాబా ఆలయంలో భక్తులు పెద్దసంఖ్యలో పూజ లు చేశారు. ఆలయ యాజమాన్యం అన్నదానం చేసింది. కోవూరులోని కోదండరామస్వామి, వీరాంజనేయస్వామి ఆల యాల్లో భక్తులు పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆల యాల్లో పూలంగిసేవ, పల్లకీసేవ చేశారు. పడుగుపాడులోని సాయికృష్ణ మందిరంలో పెద్దసంఖ్యలో హాజరైన భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆలయాల్ని విద్యుద్దీపాలతో అలంకరించారు.

ఇందుకూరుపేట : మండలంలోని నిడిముసలి గ్రామం లో షిరిడీ సాయిబాబా మందిరంలో పూజా కార్యక్రమాలు, పల్లకీసేవ నెల్లూరు భజన భక్త మండలి బృందం వారిచే సాయికీర్తనలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్య క్రమం నిర్వహించారు. ఆలయ పూజారి లేబూరు శ్రీనివాసు లు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమం లో షిరిడీ సాయిబాబా మందిర సహాయకులు నక్క హరికుమార్, విడవలూరు నారయ్య, విడవలూరు వెంకట రమణయ్య, సాయి భక్తులు పాల్గొన్నారు.

బుచ్చిరెడ్డిపాళెం : మండలంలోని జొన్నవాడలోని శ్రీ శివానందస్వామి ఆశ్రమంతోపాటు బుచ్చిరెడ్డిపాళెం, రేబాల, చెల్లాయపాళెం తదితర గ్రామాలలో సాయిబాబా మందిరాలలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలను నిర్వహించారు. జొన్నవాడ తిప్పపైన వున్న ఆశ్రమంలో శివానందస్వామికి కర్నూలు, నెల్లూరు నుంచి వారి శిష్యులు పలువురు వచ్చి గురుపూజ చేసి ఆశీర్వాదాలు పొందారు. ఈసందర్భంగా ఆశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సైదాపురం : మండలంలో సైదాపురం, చాగణం, కలిచేడు గ్రామాల్లోని సాయిబాబా మందిరాల్లో భక్తులు విశేష పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. సిద్ధేశ్వర కోన ఆవరణంలోని దక్షిణా మూర్తి ఆలయంలో స్వామివారికి అభిషేక, హోమం పూజలు నిర్వహించారు. కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



పొదలకూరు : గురుపౌర్ణమి వేడుకల్లో భక్తులు



ఇందుకూరుపేట: సాయిబాబా పల్లకిసేవ



బుచ్చి : శివానందస్వామికి గురుపూజ చేసిన భక్తులు

అల్లీపురంలో సోమిరెడ్డి పూజలు

నెల్లూరురూరల్ : గురుపౌర్ణమి సందర్భంగా సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తన స్వగ్రామమైన అల్లీపురంలోని సాయి బాబా మందిరంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి మంగళ వాయిద్యాల నడుమ పట్టువస్త్రాలు సమర్పించారు. ఆయనతో పాటు స్థానికులు బండి శ్రీకుమార్‌రెడ్డి, బొమ్మి సురేంద్ర, మేకల రామ్మూర్తి, రాధాకృష్ణనాయుడు, తదితరులు పాల్గొన్నారు.



పట్టువస్త్రాలు తీసుకువస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

తోటపల్లిగూడూరు : భగవాన్ వెంకయ్యస్వామి ఆశీస్సులు నియోజకవర్గ, రాష్ట్ర ప్రజలకు మెండుగా ఉండాలని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని వరిగొండలో గురుపౌర్ణమిని పురస్కరించుకుని భగవాన్ వెంకయ్యస్వామికి నిర్వహించిన ప్రత్యేక పూజల్లో సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర, మాజీ సొసైటీ అధ్యక్షుడు కోడూరు శ్రీనివాసులురెడ్డి, సోమిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, టీసీ సెల్ నాయకులు మన్నెం జితేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా శ్రీవారి కల్యాణం

నెల్లూరు(సాంస్కృతికం) : వ్యాస పౌర్ణమి సందర్భంగా మాగుంట లే అవుట్‌లోని ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉదయం శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వర స్వామి కల్యాణం ఆదివారం కనుల పండువగా జరిగింది. రాత్రి స్వామివారికి గరుడసేవ అలంకారంలో ఊరి ఉత్సవం జరిగింది. మాగుంట లే అవుట్ వాసు స్వామివారికి కర్పూర నీరాజనాలు సమర్పించారు. ఆలయ కమిటీ ఉభయకర్తలు పర్యవేక్షించారు. సోమవారం స్వామివారి జన్మనక్షత్రం శ్రవణం సందర్భంగా ఉదయం స్నపన తిరుమంజనం జరుగుతుందని భక్తులందరూ తరలిరావాలని ఆలయ ధర్మకర్తలు కోరారు.



కల్యాణ వేదికపై ప్రసన్నుడు

హమ్మయ్య... వేడుక అయిపోయింది..!

● ఊపిరిపీల్చుకున్న మున్సిపల్ యంత్రాంగం

నెల్లూరు(సిటీ), జూలై 21 : బారాషహీద్ దర్గా రొట్టెల పండుగ ఐదు రోజులు పాటు వైభవంగా సాగి ఆదివారంతో ముగియడంతో పారిశుధ్య నిర్వహణలో సఫలీకృతమైన మున్సిపల్ యంత్రాంగం ఊపిరిపీల్చుకుంది. రాష్ట్రంలో నూతనంగా ఏర్పడ్డ టీడీపీ ప్రభుత్వం ఆచరణలోకి వచ్చిన వెంటనే భారీగా భక్తులు వచ్చే రొట్టెల పండుగ మొదలైంది. సుమారుగా 8 లక్షల మంది వరకు హాజరై ఉంటారని అంచనా. అధికారికంగా ఐదు రోజులు, అనధికార మరో నాలుగు రోజులతో 9 రోజులు పండుగ జరగడంతో దర్గా వద్ద పారిశుధ్య నిర్వహణ యంత్రాంగానికి సవాల్‌గా మారింది. రాష్ట్ర మంత్రులు పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణరెడ్డిలతో పాటు స్థానిక ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సూచనలతో రంగంలోకి దిగిన కార్పొరేషన్ శానిటేషన్ విభాగం, ప్రైవేట్ కార్మికులు ఎట్టకేలకు పండుగ ముగియడంతో ఊపిరిపీల్చుకున్నారు. కృష్ణ, గోదావరి పుష్కరాల తరహాలో పారిశుధ్య విభాగాన్ని విభజించి లోపాలు లేకుండా విధులు నిర్వర్తించినట్లు ఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణయ్య తెలిపారు.

రొట్టెతో నగరంలో ప్రదర్శన

నెల్లూరు(వైద్యం) : రేబిస్ రహిత సమాజమే లక్ష్యంగా ప్రతి ఒక్కరు పనిచేయాలని వైద్యశాఖ అధికారి డాక్టర్ జైపాల్‌రెడ్డి పిలుపు నిచ్చారు. ఆదివారం నెల్లూరు నగరంలోని బారాషాహిద్ దర్గా రొట్టెల పండుగలో బ్లాక్‌బోర్డు మిత్రమండలి, కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రేబిస్ రహిత భారత్ రొట్టెను పట్టుకుని నగరంలో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం రొట్టె వదిలారు. ఈ కార్యక్రమంలో కోటమిట్ట పట్టణ ఆరోగ్య కేంద్రం డాక్టర్ నవీన్‌కృష్ణ, రాపూరు ఫైర్ అధికారి డాక్టర్ కుప్పయ్య, నారాయణ, ఆర్ఎంపీ, పీహెచ్‌పీ నాయకులు శాఖవరపు వేణుగోపాల్, గోరంట్ల శేషయ్య, కోలా రవీంద్రబాబు, రోజారాణి, గౌస్‌బాషా, బ్లాక్‌బోర్డు మిత్రమండలి అధ్యక్షుడు నరసాపురం ప్రసాద్, రాజేశ్వరి, కరుణకుమారి, మహ్మద్‌గౌస్ తదితరులు పాల్గొన్నారు.

కుంగిన వంతెన

● నిలిచిపోయిన రాకపోకలు

మనుబోలు, జూలై 21: మండలంలోని పిడూరు పంచాయతీలోని సీతారామపురం గిరిజన కాలనీ సమీపంలో ఉన్న వంతెన ఆదివారం సాయంత్రం కూలిపోయింది. పిడూరు-ఎల్ఎస్‌పురం గ్రామాలకు అంతర్గత రోడ్డు నిర్మించే క్రమంలో మధ్యలో పంటకాలువ రావడంతో సుమారు 40ఏళ్ల క్రితం పది అడుగుల మేర వంతెన ఏర్పాటు చేశారు. రెండేళ్ళుగా వంతెన అడుగు భాగం దెబ్బతిన్నా ఎవరూ పట్టించుకోలేదని కాలనీవాసులు తెలిపారు. అయితే తాటిచెట్ల లోడుతో భారీ వాహనం వంతెనపై వెళ్లగానే నిమిషాల వ్యవధిలోనే వంతెన కూలిపోయింది. ఆ సమయంలో వంతెనపై పిల్లలుగాని, ఎలాంటి వాహనాలు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. వంతెన లేకపోతే పిడూరు నుంచి లక్ష్మీనరసింహపురం, కాగితాలపూరు గ్రామాలకు రాకపోకలు సాగించలేరు. అలాగే చెరువు నుంచి పొలాలకు ఈ వంతెన కింద ఉన్న పంటకాలువ ద్వారా వెళ్ళాల్సి ఉంటుంది. అధికారులు స్పందించి వంతెనకు ప్రత్యామ్నాయ మార్గం ఏర్పాటు చేయాలని రెండు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



పిడూరు-ఎల్ఎస్‌పురం మార్గంలో కూలిన వంతెన

తిరుమలకు టీడీపీ నేతల పాదయాత్ర



కోవూరులో టీడీపీ నేతల పాదయాత్ర బృందం

కోవూరు, జూలై 21: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటుకావడంతో దర్శి నియోజకవర్గ పరిధిలోని కమ్మవారిపాళెం గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు చేపట్టిన పాదయాత్ర ఆదివారం కోవూరు చేరుకుంది. ఈ సందర్భంగా తెలుగు యువత నాయకుడు కాట్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టిన తరువాత తిరుమలకు పాదయాత్ర చేస్తామని మొక్కుకున్నట్లు చెప్పారు. పాదయాత్రలో టీడీపీ నాయకులు దామారావు, దామా స్వామిశేఖర్, మామిడిపల్లి శ్రీను, గరికపాటి వెంకటేశ్వర్లు, నిడమానూరు బాబు, నాగేంద్ర చిన్ని, నిడమానూరు శ్రీహరి పాల్గొన్నారు. పాదయాత్ర బృందం కోవూరు పట్టణంలోని ప్రధాన వీధి మీదుగా నెల్లూరు నగరంలోని శ్రీరంగనాథస్వామి ఆలయానికి బయలుదేరింది.

ఘనంగా గ్రామదేవతకు పొంగళ్లు

మనుబోలు, జూలై 21: మండల కేంద్రమైన మనుబోలు గ్రామదేవత మనుబోలమ్మకు గ్రామస్థులు ఆదివారం ఘనంగా పొంగళ్లు నిర్వహించారు. అలాగే నాగారప్పమ్మకు, గంగమ్మకు అభిషేకాలు, పూజలు చేశారు. ఆలయ అర్చకులు సర్వేపల్లి ఫణీంద్ర శర్మ అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించి, భక్తులకు తీర్థ, ప్రసాదాలు అందజేశారు.

ఓటమిని జీర్ణించుకోలేక సోమిరెడ్డిపై కాకాణి అక్కసు

పొదలకూరు, జూలై 21: ఓటమిని జీర్ణించుకోలేక మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సోమిరెడ్డి మీద అక్కసు చూపిస్తే ఊరుకునేది లేదని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు తలచీరు మస్తాన్‌బాబు, పట్టణ అధ్యక్షుడు బొద్దులూరి మల్లికార్జున్‌నాయుడు, రాష్ట్ర తెలుగు రైతు ఆర్గనైజింగ్ సెక్రటరీ కోడూరు పెంచలభాస్కర్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ మంత్రి కాకాణి తన హయాంలో పొదలకూరుతోపాటు తన తండ్రి పేరిట తన సొంత తోడేరు పంచాయతీలో కాకాణి రమణారెడ్డి గార్డెన్స్ పేరుతో మూడు విభాగాలుగా లేఅవుట్లు వేసి ఒక్కదానికి కూడా ఒరిజినల్ అనుమతులు లేకుండా నకిలీ పత్రాలను సృష్టించారన్నారు. 1700 మంది ప్లాట్లు కొనుగోలు చేశారని, వారిని మోసగించినందుకు కాకాణి, అతని అనుచరులతో వారికి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కలిచేటి ప్రభాకర్‌రెడ్డి, అక్కెం సుధాకర్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు ఆదాల సుగుణమ్మ, కోవూరు బక్కయ్యనాయుడు, పులిపాటి వెంకటరత్నంనాయుడు, ఆలుపూరు శ్రీనివాసులు, వెన్నపూస రాజశేఖర్‌రెడ్డి, సాదం గిరీష్‌కుమార్, వెంపులూరు అరుణ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

'చిగురించిన చిరునవ్వు' పుస్తకావిష్కరణ

నెల్లూరు (సాంస్కృతికం) జూలై 21 : నెల్లూరుజిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం టౌనుహాలులో సందడి అరుణ రచించిన చిగురించిన చిరునవ్వు కథా సంపుటి గ్రంథావిష్కరణ జరిగింది. ఆ సంఘం అధ్యక్షుడు ఏ.జయప్రకాష్ సభకు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా గ్రంథాలయ కార్యదర్శి కుమార్‌రాజా హాజరయ్యారు. పద్య కళాపరిషత్ అధ్యక్షుడు మెట్టు రామచంద్రప్రసాద్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. డాక్టర్ పాతూరి అన్నపూర్ణ, డాక్టర్ పెళ్లకూరు జయప్రద, ఈతకోట సుబ్బారావు, తేళ్ల అరుణ, వడాలి రాధాకృష్ణ, చిన్ని నారాయణరావులు రచయిత్రి సందడి అరుణను అభినందించారు. ఈ సందర్భంగా జరిగిన కథల పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రపంచ తెలుగు మహాసభ రీజియన్ చైర్మన్ నలబోలు బలరామయ్యానాయుడు, తదితరులు పాల్గొన్నారు.

వాస్తవాలు మాట్లాడితే అంత ఉలుకెందుకు..?

ముత్తుకూరు, జూలై 21: ముత్తుకూరు పంచాయతీలో చోటుచేసుకున్న అవినీతి అక్రమాలపై వాస్తవాలు మాట్లాడితే వైసీపీ నాయకులకు ఉలుకెందుకని సర్పంచ్ బూదూరు లక్ష్మీ ప్రశ్నించారు. ముత్తుకూరులో ఆదివారం విలేకరుల సమావేశంలో వార్డుసభ్యుడు అబ్దుల్ షఫీవుల్లాతో కలిసి మాట్లాడుతూ గిరిజన మహిళ అనే కారణంతో వాస్తవాలు చెప్పిన తనను అసత్య ఆరోపణలతో వేధించాలని చూస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్నది ఎవరో, పంచాయతీలో పనులు పేరు చెప్పి వైసీపీ నాయకుల దగ్గర లక్షలు లక్షలు తీసుకుని ఎగ్గొట్టిందెవరో అందరికీ తెలుసునని టీడీపీ మైనార్టీ నాయకులు షఫీవుల్లా చెప్పారు. అన్నింటికీ పక్కా ఆధారాలు ఉన్నాయని, విచారణకు సిద్ధమా అని సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు మణి, టీడీపీ నాయకులు అలారి రమణమ్మ, దుర్గ, శ్రీహరి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచు లక్ష్మి

వీడని ముసురు



ఆకాశంలో కమ్ముకున్న నీలి మేఘాలు

నెల్లూరు(సిటీ), జూలై 21: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి, నైరుతి రుతుపవనాల కలయికతో వాతావరణం ప్రతికూలంగా మారింది. గడిచిన మూడు రోజులుగా ముసురేసింది. తేలికపాటి వర్షాలు పడుతూనే ఉన్నాయి. నెల్లూరులో రెండు రోజులుగా స్వల్ప వర్షం కురుస్తూనే ఉంది. దీంతో నగర వాసులుకు ఇబ్బందులు తప్పడం లేదు. ఆదివారం నగరంలో ఓ మోస్తరు వర్షం పడటంతో పలు ప్రాంతాల నుంచి రొట్టెల పండుగకు వచ్చిన భక్తులు ఆశ్రాయాలు లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అటు రోడ్లపై వర్షపు నీరు నిలవడం వల్ల వాహనదారులు ఇక్కట్లు ఎదుర్కోవాల్సి వచ్చింది. కాగా నెల్లూరు నగరంలో ఆదివారం సాయంత్రం 7 గంటలకు 5.5 మి.మీ వర్షం నమోదైనట్లు గణాంక శాఖ తన వెబ్‌సైట్‌లో పేర్కొంది.

టీడీపీ నాయకుల చొరవతో తాగునీటి సమస్య పరిష్కారం

తోటపల్లిగూడూరు, జూలై 21 : మండలంలోని మహాలక్ష్మీపురం దళిత కాలనీలో గత పది సంవత్సరాల నుంచి తాగునీటి సమస్య ఉంది. ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఇచ్చిన వాగ్దానం మేరకు కొత్త బోరును ఏర్పాటుచేసి కాలనీకి తాగునీరు అందించడంతో కాలనీవాసులు కోడూరు గ్రామ టీడీపీ ఇన్‌చార్జ్ వీరబోయిన గంగాధర్‌ను ఆదివారం సత్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచు కృష్ణవేణి, పంచాయతీ సెక్రటరీ శ్రీనివాసులు, మాజీ ఎంపీటీసీ శ్రీనివాసులు, చెరుకూరు పరంధామయ్య, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

గాంధీ ఆశ్రమంలో సర్వమత ప్రార్థనలు

ఇందుకూరుపేట, జూలై 21: మండలంలోని పల్లెపాడు పినాకినీ సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో కో కన్వీనర్ నెల్లూరు రవీంద్రరెడ్డి ఆధ్వర్యంలో సర్వమత ప్రార్థనలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ముందుగా గాంధీ ఆశ్రమ కమిటీ సభ్యురాలు గంపల మంజుల మహాత్మాగాంధీ, స్థల దాత పొణక కనకమ్మ విగ్రహాలకు నూలు మాలలు, ఖాదీ వస్త్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో కో కన్వీనర్ నెల్లూరు రవీంద్రారెడ్డి, స్కూల్ విద్యార్థులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా దేవాంగ వధూవరుల వివాహ పరిచయ వేదిక



ప్రసంగిస్తున్న జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మన్నెం

నెల్లూరు(సాంస్కృతికం), జూలై 21 : దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని పొదలకూరు రోడ్డు లో ఉన్న హెచ్‌ఆర్ కళ్యాణ మండపంలో దేవాంగ వధూ వరుల వివాహ పరిచయ వేది క ఆదివారం అట్టహాసంగా జరిగింది. ముందుగా కుల దైవం చాముండేశ్వరి దేవి, దేవాంగ వంశ మూలపురుషుడైన దేవతల మహర్షికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అనంతరం వధూవరుల వివాహ పరిచయ వేదికను దేవాంగ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మన్నెం సతీష్ ప్రారంభించారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర అధ్యక్షుడు నాగశయనం పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ తెలంగాణ రాష్ట్రాల నుంచి దేవాంగ వధూవరులు, వారి తల్లిదండ్రులు భారీగా హాజరయ్యారు. ఎల్ఈడీ స్క్రీన్‌పై వధూవరుల వివరాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు సజ్జ సతీష్‌కుమార్, మన్నెముద్దు శ్రీనివాసులు, కర్ల చంద్రశేఖర్‌రావు, హెచ్‌ఆర్ కళ్యాణ మండపం అధినేత కర్ల రాఘవరావు, హైదరాబాద్ దేవాంగ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్లు పీవీఎస్ ప్రకాష్, జానా వెంకటేశ్వరరావు, కల్యాణం విభాగం అధ్యక్ష, కార్యదర్శులు కర్లా రవీంద్ర, మాధవ, ఉదయభాస్కర్, జిల్లా ప్రధాన కార్యదర్శి పముజుల శంకరయ్య, కోశాధికారి కొండా మాధవయ్య, మహిళా సంఘం అధ్యక్షురాలు బండ్ల హైమావతి పాల్గొన్నారు.

పటిష్టంగా జనసేన పార్టీ లీగల్ సెల్


నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జూలై 21: అన్ని పార్టీలతో పోల్చుకుంటే జనసేన పార్టీ లీగల్ సెల్ పటిష్టంగా ఉందని, లీగల్ సెల్ అండగా ఉందన్న ధైర్యంతోనే ఎన్నో ప్రజా పోరాటాలు చేశామని జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ పేర్కొన్నారు. నగరంలోని గోమతినగర్‌లో ఉన్న జనసేన పార్టీ కార్యాలయంలో లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు చదలవాడ రాజేష్ ఆధ్వర్యంలో ఆదివారం సభ్యత్వ నమోదు జరిగింది. ఈ కార్యక్రమంలో పార్టీ కోర్ కమిటీ సభ్యులు నూనె మల్లికార్జునయాదవ్, న్యాయవాదులు శరత్, శ్రీరామ్, గురుకుమార్, చిరంజీవి, మధు, సుభాషిణి, ఆరతి, జమునరాణి, తదితరులు పాల్గొన్నారు.

భారతజాతికి శ్రీరాముడు ఆదర్శం

నెల్లూరు(సాంస్కృతికం), జూలై 21 : భారత జాతికి శ్రీరాముడు ఆదర్శమూర్తి అని ప్రవచకులు పోలవరపు లక్ష్మీనరసింహారావు తెలిపారు. ఆదివారం రాత్రి టౌనుహాలులో పద్య కళాపరిషత్ ఆధ్వర్యంలో బ్రహ్మశ్రీ పాలూరి హనుమజ్జానకీరామ శర్మ శత జయంతి ఉత్సవాల్లో 9వ సమావేశం జరిగింది. ఈ సభకు ముఖ్య అతిథిగా ప్రపంచ తెలుగు సమాఖ్య రీజనల్ చైర్మన్ నలుబోలు బలరామయ్యనాయుడు పాల్గొన్నారు. హనుమజ్జానకీరామ శర్మ రచించిన శ్రీరామాయణ తరంగిణిపై పోలవరపు లక్ష్మీనరసింహారావు ప్రవచనం చేశారు. ఈ సభలో విశ్రాంత లెక్చరర్ గిరిజాలక్ష్మి, కొండేపి మురళీకృష్ణ, ఎంఆర్ ప్రసాద్, హనుమజ్జానకీశర్మ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.


గుర్రం జాషువా డిజిటల్ గ్రంథాలయం అభివృద్ధికి సీఎం హామీ

నెల్లూరు(సాంస్కృతికం), జూలై 21: నెల్లూరు నగరంలోని పాత జూబ్లీ ఆసుపత్రి ఆవరణలో పునఃనిర్మాణం జరుగుతున్న గుర్రం జాషువా డిజిటల్ గ్రంథాలయం అభివృద్ధికి అన్ని విధాల సహకరిస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారని ఆ గ్రంథాలయం వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్.ఖాసిం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజధాని అమరావతిలో ప్రజా విజ్ఞప్తుల వేదికలో చంద్రబాబునాయుడుని కలిసి వినతిపత్రం ఇచ్చి ప్రస్తుత పరిస్థితులను వివరించామని తెలిపారు. దానిపై సీఎం సానుకూలంగా స్పందిస్తూ గ్రంథాలయ భవన నిర్మాణం పూర్తి చేయించి డిజిటల్ గ్రంథాలయంతోపాటు స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రం ఏర్పాటుకు కృషి చేస్తామన్నారని తెలిపారు. దీనిని పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ పర్యవేక్షిస్తారని తెలిపారని కూడా తెలిపారు.





కన్నులపండువగా శ్రీవారి గరుడవాహనసేవ



తిరుమల క్షేత్రంలో ఆదివారం గరుడసేవ కన్నులపండువగా జరిగింది. గురుపౌర్ణమి సందర్భంగా విశేష అలంకరణలో మలయప్పస్వామి తన ఇష్టవాహనమైన గరుడునిపై కొలువుదీరి ఆదివారం రాత్రి ఏడు గంటలకు ఆలయ నాలుగు మాడవీధుల్లో విహరించారు. ఆదివారం సెలవుదినం, గురుపౌర్ణమి కూడా కావడంతో భక్తులు భారీగా మాడవీధుల్లోని గ్యాలరీల్లోకి చేరుకుని ఉత్సవమూర్తిని దర్శించుకున్నారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో వేదమంత్రాలు, మంగళవాయిద్యాల మధ్య వాహనసేవ వైభవంగా జరిగింది. గ్యాలరీల్లోని భక్తులు కర్పూర హారతులిస్తూ గోవిందనామస్మరణలతో స్వామిని దర్శించుకుని ఆనందపరవశులయ్యారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



తిరుపతి రాఘవేంద్రనగర్‌లోని సాయిబాబా ఆలయంలో భక్తుల రద్దీ



వైభవంగా గురుపూజోత్సవం

గురుపౌర్ణమి సందర్భంగా ఆదివారం జిల్లావ్యాప్తంగా గురుపూజోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. సాయిబాబా ఆలయాలైతే భక్తులతో కిక్కిరిశాయి.

టీడీపీ, వైసీపీ శ్రేణుల ఘర్షణ

- పాకాలలో ఉద్రిక్తత
- భారీగా చేరుకున్న పోలీసు బలగాలు



పాకాల పోలీసు స్టేషన్ ఎదుట ఘర్షణ పడుతున్న టీడీపీ, వైసీపీ శ్రేణులు, చుట్టుముట్టిన పోలీసులు

పాకాల, జూలై 21: టీడీపీ, వైసీపీ శ్రేణుల మధ్య పాకాలలో ఆదివారం ఘర్షణ జరిగింది. దీంతో ఉద్రిక్తత వాతావరణ నెలకొంది. మధ్యాహ్నం పాకాల మండలంలోని దేశిరెడ్డిపల్లెలో ఓ ఫంక్షన్‌కి వెళ్లి తిరిగి వస్తున్న టీడీపీ యువకులకు పంటపల్లె సమీపంలో వైసీపీ యువకులు తారసపడ్డారు. ఈ సందర్భంగా ఇరువర్గాల మధ్య మాటామాటా పెరిగి ఘర్షణకు దారితీసింది. ఆపై పాకాల పోలీస్ స్టేషన్ సమీపంలో ఉన్న వైసీపీ నేతకు చెందిన దుస్తుల దుకాణం వద్ద మరోసారి ఘర్షణ పడ్డారు. తిరిగి సాయంత్రం వైసీపీ, టీడీపీ నాయకులు ఫిర్యాదు చేయడానికి పోలీస్‌స్టేషన్ వద్దకు పెద్దసంఖ్యలో చేరుకున్నారు. ఈ సమయంలో మళ్లీ ఘర్షణ వాతావరణం నెలకొంది. ఎవరిమీద ఎవరు దాడి చేస్తున్నారో తెలియక కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఏఎస్పీ కులశేఖర్, డీఎస్పీ నరసింగప్ప, సీఐ శ్రీరాముడు, ఎస్‌ఐలు, వందమందికి పైగా సాయుధ బలగాలు పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. పోలీస్‌స్టేషన్ ఎదుట ఘర్షణ పడుతున్న ఇరువర్గాలను చెదరగొట్టారు. ఈ సందర్భంగా గాయపడిన ఇరువర్గాల వారూ పరస్పరం ఫిర్యాదు చేసుకున్నారు.

మేమొచ్చేస్తాం ప్లీజ్..!

- కూటమిలో చేరేందుకు వైసీపీ కార్పొరేటర్ల ఉత్సాహం
- కెన్సెస్ హోటల్లో ఎన్వీప్రసాద్‌తో సుదీర్ఘ మంతనాలు
- డిప్యూటీ మేయర్ ముద్రతోపాటు పదిమందికిపైగా చేరేందుకు సిద్ధం



కెన్సెస్ హోటల్ వద్ద వైసీపీ కార్పొరేటర్లు

తిరుపతి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): అనుకున్నదే అవుతోంది. తిరుపతి కార్పొరేషన్‌లోని వైసీపీ కార్పొరేటర్లు ఎన్డీఏ కూటమిలో చేరేందుకు పడుతున్న ఉత్సాహం ఓ కొలిక్కి వస్తోంది. వైసీపీలో ఇక ఇమడలేమని, మేమొచ్చేస్తాం ప్లీజ్..! అంటూ పలువురు ముందుకొస్తున్నారు. ఈనేపథ్యంలో తుడా మాజీ చైర్మన్ ఎన్వీ ప్రసాద్ నేతృత్వంలో ఆదివారం స్థానిక కెన్సెస్ హోటల్లో రహస్య సమావేశం జరిగింది. డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణతో పాటు కార్పొరేటర్లు నరసింహాచారి, నరేంద్రనాథ్, అమరనాథ్ రెడ్డి, అనిల్, కుడితి సుబ్రమణ్యం, మహిళా కార్పొరేటర్ల భర్తలు, కుటుంబ సభ్యులు దొడ్డారెడ్డి మునిశేఖర్ రెడ్డి, తిరుత్తణి వేణుగోపాల్, దూది శివ, బాలాజీ తదితరులు హాజరైనట్టు తెలిసింది. ఒక్కొక్కరు వేర్వేరుగా ఎన్వీ ప్రసాద్‌తో సుదీర్ఘంగా చర్చించినట్టు సమాచారం. బేషరతుగా కూటమిలో చేరుతామని కొందరు చెబితే, మరికొంత మంది వారి వ్యక్తిగత డిమాండ్లను, మళ్లీ కార్పొరేటర్ టికెట్ తమకే ఇవ్వాలన్న నిబంధన కూడా పెట్టినట్టు తెలిసింది. అదేవిధంగా అవిశ్వాసంలో కొత్తకౌన్సిల్ కొలువుతీరితే డిప్యూటీ మేయర్ పదవులను తమకే ఇవ్వాలని పలువురు కోరినట్టు సమాచారం.

మేయర్ రాకకోసం

కౌన్సిల్లో కూటమి పార్టీలకు బలం పెరిగినా నాలుగేళ్ల వరకు అవిశ్వాసం పెట్టి మేయర్‌ను తొలగించే అవకాశం లేదు. కౌన్సిల్ ఏర్పాటై ఇప్పటికి మూడన్నరేళ్లు దాటేసింది. అయితే ప్రస్తుత మేయర్ డాక్టర్ శిరీష కూటమి పార్టీలో చేరిపోతే ఆమే మేయర్‌గా అధికార పక్షంలో కొనసాగే అవకాశాలు కనిపిస్తున్నాయి. మళ్లీ ఎన్నికలు జరిగేవరకు ఆమెనే కొనసాగించేందుకు మెజార్టీ కార్పొరేటర్లు కూడా ఆసక్తి చూపుతున్నారు. ఒకవేళ ఆమె వైసీపీలోనే కొనసాగితే మరో ఆరు నెలల్లో అవిశ్వాస తీర్మానానికి కూటమి కార్పొరేటర్లు సిద్ధపడే అవకాశం ఉంది. మేయర్ కూటమిలో చేరుతుందన్న ప్రచారం ఓవైపు జరుగుతున్నప్పటికీ ఆమె నిర్ణయంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొని ఉంది.

శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చే భక్తులకు గాజు బాటిళ్లలో తక్కువ ధరకే నీరందించడానికి టీటీడీ కసరత్తు మొదలు పెట్టింది. ఇందుకోసం బ్రాండెడ్ వాటర్ బాటిళ్ల విక్రయ సంస్థలను ఆహ్వానించేందుకు సిద్ధమవుతోంది.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

గాజు బాటిళ్లలో తక్కువ ధరకే నీరు

తిరుమలలో భక్తులకు అందించడానికి బ్రాండెడ్ సంస్థలను ఆహ్వానించనున్న టీటీడీ



ప్రస్తుతం తిరుమలలో విక్రయిస్తున్న గాజు బాటిళ్లు

తిరుమలలో ప్లాస్టిక్ వాటర్ బాటిళ్ల విక్రయాలను నిలిపివేయాలని 2019 డిసెంబరు నెలలో టీటీడీ ఆదేశాలు జారీ చేసింది. 2020నుంచే కొండపైకి ప్లాస్టిక్ వాటర్‌బాటిళ్ల రాక నిలిచిపోయింది. దాంతో భక్తులు కొద్దినెలలపాటు జల ప్రసాదాలపైనే ఆధారపడాల్సి వచ్చింది. ఆ తర్వాత గతంలో ప్రముఖ వాటర్ బాటిళ్లను తిరుమలకు సరఫరా చేసే ఎనిమిది కంపెనీల డీలర్లు టీటీడీ ఉన్నతాధికారులను కలిసి హఠాత్తుగా వాటర్‌బాటిళ్ల విక్రయాలను ఆపేస్తే తాము రోడ్డుపై పడతామని, గాజు బాటిళ్లలో తాగునీరు సరఫరా చేసే అవకాశమివ్వాలంటూ కోరారు. ఆ క్రమంలోనే ఆ తొమ్మిది మంది డీలర్లు, గత వైసీపీ రాజకీయ సిఫారసుతో వచ్చిన మరో డీలరు లోకల్‌గా ఉన్న ప్లాంట్ నుంచి ఏడు లోకల్ బ్రాండ్లతో నీటిని సరఫరా చేస్తూ వస్తున్నారు. రూ.50లకు వాటర్ బాటిల్ విక్రయిస్తారు. బాటిల్‌ను వెనక్కిచ్చేస్తే తిరిగి రూ.30 భక్తుడికి ఇస్తారు.

బహిరంగ ప్రకటనతో పెద్ద బ్రాండ్లకు ఆహ్వానం

నిబంధన ప్రకారం వాటర్ బాటిళ్ల విక్రయాలు జరగడం లేదని ఫిర్యాదులు ఇప్పటికే టీటీడీకి అందాయి. గాజుబాటిల్ తిరిగి ఇస్తున్నప్పటికీ డిపాజిట్ ఇవ్వడం లేదని కొందరు, రూ.50 బాటిల్‌కు రూ.60, రూ.70 విక్రయిస్తున్నారని మరి కొందరి నుంచి ఫిర్యాదులు అందాయి. దీనిపై ఇప్పటికే ఈవోగా బాధ్యతలు స్వీకరించిన శ్యామలరావు ప్రత్యేక దృష్టి పెట్టారు. ఇటీవల శ్రీవారి మెట్టుమార్గంలో ఓ దుకాణంలో తనిఖీలు చేసి అధిక ధరకు బాటిల్ విక్రయిస్తున్నట్టు గుర్తించి నోటీసులు జారీ చేశారు. ఈ క్రమంలో ప్రస్తుతమున్న లోకల్ బ్రాండ్లు నీటి నాణ్యత బాగానే ఉన్నప్పటికీ పెద్ద కంపెనీలను బహిరంగ ప్రకటనతో ఆహ్వానించాలని భావిస్తున్నారు. తద్వారా క్వాలిటీ వాటర్‌ను తక్కువ ధరకు భక్తులకు అందజేయవచ్చని అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికే కొన్ని ప్రముఖ నీటి సరఫరా కంపెనీలు లోకల్ బ్రాండ్ ధరలకే విక్రయించేందుకు సిద్ధంగా ఉన్నట్టు సమాచారం.

26 మంది పీఎస్‌ఐల బదిలీ

తిరుపతి (నేరవిభాగం), జూలై 21: ఎన్నికల నేపథ్యంలో అనంతపురం, సత్యసాయి జిల్లాల నుంచి మన జిల్లాకు వచ్చిన 26 మంది రిజర్వు పీఎస్‌ఐలను బదిలీ చేశారు. ఈ మేరకు అనంతపురం రేంజ్ డీఐజీ ఆదివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే ఆయా జిల్లాల్లో పనిచేస్తున్న మన జిల్లాకు 17 మంది పీఎస్‌ఐలను కూడా ఇక్కడికి బదిలీ చేశారు. వీరందరూ తక్షణమే రిలీవ్ అయి తమ, తమ జిల్లాల ఎస్పీల వద్ద రిపోర్టు చేసుకోవాలని ఆ ఆదేశాల్లో పేర్కొన్నారు.



ప్రొఫెసర్లతోపాటు జాతీయ గీతం ఆలపిస్తున్న గోపాలకృష్ణన్, సజ్జన్ జిందాల్, కేఎస్ సత్యనారాయణ

సామాజిక బాధ్యత అలవర్చుకోండి

- ఇన్ఫోసిస్, యాక్సిలర్ వెంచర్స్ సహ వ్యవస్థాపకుడు క్రిస్ గోపాలకృష్ణన్
- ఘనంగా ఐఐటీ ఆరో స్నాతకోత్సవం
- 338మంది విద్యార్థులకు డిగ్రీల ప్రదానం

ఏర్పేడు, జూలై 21: ప్రతి విద్యార్థీ సామాజిక బాధ్యత అలవర్చుకోవాలని ఇన్ఫోసిస్, యాక్సిలర్ వెంచర్స్ సహ వ్యవస్థాపకుడు క్రిస్ గోపాలకృష్ణన్ పిలుపునిచ్చారు. ఏర్పేడు వద్ద ఉన్న తిరుపతి ఐఐటీలో ఆరో స్నాతకోత్సవాన్ని అధికారులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం 3.30 గంటలకు ప్రారంభమైన కార్యక్రమం ఆరు గంటలకు ముగిసింది. ముఖ్య అతిథిగా హాజరైన క్రిస్ గోపాలకృష్ణన్ మాట్లాడుతూ.. సాంకేతిక పరిజ్ఞానంతో విద్యార్థులు కోపైలెట్‌గా ఎదగాలని విద్యార్థులకు సూచించారు. సాంకేతికత అనేది కేవలం ఒక సాధనం మాత్రమే కాకుండా సహ ఇంటెలిజెన్స్ భాగస్వామి అని చెప్పారు. సాంకేతికత కొత్త అవకాశాలను సృష్టిస్తోందని తెలిపారు. తిరుపతి ఐఐటీలో చదువుకోవడం అదృష్టవంతులుగా భావిస్తున్నానన్నారు. మీరు చేసే అన్ని ప్రయత్నాల్లో శ్రేష్ఠత కోసం కృషి చేయాలని అన్నారు.

2047నాటికి వీక్షిత్ భారత్‌గా మార్చాలి: సజ్జన్ జిందాల్

మనదేశాన్ని 2047నాటికి వీక్షిత్‌భారత్‌గా మార్చేందుకు ప్రభుత్వం అన్ని విధాల ప్రయత్నం చేస్తోందని బోర్డు ఆఫ్ గవర్నర్స్, జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ చైర్మన్ సజ్జన్ జిందాల్ అన్నారు. స్నాతకోత్సవానికి సహ ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. వీక్షిత్‌భారత్ కోసం చాలా సమగ్రమైన విధానం అవసరమని చెప్పారు. అంతేకాకుండా పౌరులందరి పట్టుదల, అంకితభావంతో మాత్రమే అది సాధ్యమవుతుందన్నారు. ఐఐటీ డైరెక్టర్ కేఎస్ సత్యనారాయణ మాట్లాడుతూ.. ప్రస్తుతం 1,500 మంది చదువుతున్నారన్నారు. వీరందరికీ అవసరమైన వసతులు సమకూరుస్తున్నట్లు తెలిపారు. ఐసర్ డైరెక్టర్ శాంతనూ భట్టాచార్య, ఐఐటీ పీఆర్వో చమన్ మెహతా, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ మహేష్ కుమార్, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

అవార్డులు, డిగ్రీలిలా..

క్రిస్ గోపాలకృష్ణన్, సజ్జన్ జిందాల్ చేతుల మీదుగా అవార్డులను విద్యార్థులు అందుకున్నారు. ప్రెసిడెంట్ అవార్డును అనూష్ మంగళ్, గవర్నర్స్ అవార్డును ఎంఎస్ స్నేహ, ప్రొఫెసర్ కంటమ్ కృష్ణయ్య అవార్డును అరిమంత భవన్‌రెడ్డి, రామకృష్ణ లక్ష్మీకాంత మెమోరియల్ ప్రైజ్‌ను ప్రశాంత్‌సింగ్, అమరరాజా గ్రూప్ అవార్డును డేవిడ్సన్ పొల్ల, ఇన్‌స్టిట్యూట్ అవార్డులను జనపతి వెన్నెలదేవి, ఇందుకూరి నాగమహిత అందుకున్నారు. అలాగే 210మంది బీటెక్ డిగ్రీలు, 76మందికి ఎంటెక్, 28మందికి ఎమ్మెస్సీ, 16మందికి ఎంపీపీ, ముగ్గురికి ఎంఎస్ పరిశోధన, ఐదుగురికి పీహెచ్‌డీ, ఇన్‌స్టిట్యూట్ నుంచి ఒకరికి డిప్లొమా డిగ్రీలు ప్రదానం చేశారు. మొత్తంగా 338మంది విద్యార్థులు డిగ్రీలు అందుకున్నారు. ఈ స్నాతకోత్సవం ప్రారంభానికి ముందు అమరరాజా గ్రూప్ ఛైర్మన్, అండ్ డైరెక్టర్ మాజీ ఎంపీ గల్లా జయదేవ్ ఐఐటీని సందర్శించారు. అనంతరం ఐఐటీ అధికారులతో సమావేశమై అమరరాజా గ్రూప్‌సంస్థ బ్యాటరీ తయారీ రంగంలో ఎలా ముందుకు పోతుందో అనే విషయాలను వివరించారు. స్నాతకోత్సవానికి విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రొఫెసర్లు, నిపుణులు హాజరయ్యారు. దీంతో పండుగ వాతావరణం నెలకొంది.



ప్రశాంత్‌సింగ్ (రామకృష్ణ లక్ష్మీకాంత్ మెమోరియల్ అవార్డు)



డేవిడ్‌సన్ పొల్ల (అమరరాజ గ్రూప్ అవార్డు)





ఇన్‌స్టిట్యూట్ అవార్డు అందుకుంటున్న ఇందుకూరి నాగమహిత, జనపతి విన్నెలదేవి





ప్రెసిడెంట్ అవార్డుతో అనూష్ మంగళ్, ఎంఎస్ స్నేహకు గవర్నర్స్ అవార్డు ప్రదానం చేస్తున్న అతిథులతో ఐఐటీ డైరెక్టర్ కేఎస్ సత్యనారాయణ

పూర్వజన్మ సుకృతం

ప్రెసిడెంట్ అవార్డు అందుకోవడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నా. ఇంత మందిలో నాకు అవార్డు రావడం గర్వంగా ఉంది.

- అనూష్ మంగళ్, ప్రెసిడెంట్ అవార్డు గ్రహీత

ఆనందంగా ఉంది

నాకు గవర్నర్స్ అవార్డు రావడం ఆనందంగా ఉంది. కృషి, పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చు. ప్రతి ఒక్కరూ బాగా చదుకోవాలని కోరుతున్నా.

- ఎంఎస్ స్నేహ, గవర్నర్స్ అవార్డు గ్రహీత

కంటి వైద్యశిబిరానికి స్పందన



గూడూరు, జూలై 21: స్థానిక డీఎస్‌ఆర్ కమ్యూనిటీ హాలులో ఆదివారం ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో నెల్లూరుకు చెందిన సుశీల నేత్రాలయం సహకారంతో కంటి వైద్య ఉచిత శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు కె.చంద్రశేఖర్ మాట్లాడుతూ... శిబిరానికి పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన 110 మందికి డాక్టర్ సుధాకర్ రావు వైద్యపరీక్షలు నిర్వహించారన్నారు. అవసరమైన వారికి ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహిస్తామన్నారు. అనంతరం మందులను పంపిణీ చేశారు. జి.చంద్రశేఖర్, సుశీల, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ



సరుకులు అందిస్తున్న జేవీవీ నాయకులు

గూడూరు అర్బన్, జూలై 21: స్థానిక బనిగీ సాహెబ్ పేటలోని పెట్రోలు బంకు వద్ద ఆదివారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో వెంకట నారాయణ దాతృత్వంతో దివ్యాంగులకు కూరగాయలు, కోడిగుడ్లు పంపిణీ చేశారు. ప్రతినెలా జేవీవీ ఆధ్వర్యంలో దివ్యాంగులకు చేయూతనందిస్తున్నారు. కార్యక్రమంలో చెంచునారాయణ, నాగరాజు, రాధయ్య, విజయబాబు, సుబ్బారావు, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు. డీఎస్‌ఆర్ కమ్యూనిటీ హాలులో సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో డాక్టర్లు జనార్దన రెడ్డి, రోహిణి దాతృత్వంతో పేదలకు నిత్యావసరాలను పంపిణీ చేశారు. సనత్‌కుమార్‌రెడ్డి, ధనుంజయరెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, దశరథరామిరెడ్డి, వెంకటకృష్ణారెడ్డి, ప్రజేంద్రరెడ్డి పాల్గొన్నారు.

● నాయుడుపేట పట్టణంలోని సంజాయ్‌గాంధీకాలనీలో ఉన్న మేరీ వృద్ధాశ్రమానికి గురుపూర్ణిమ సందర్భంగా కాపులూరుకు చెందిన రాజేష్, దయాకర్, రమేష్ నిత్యావసర సరుకులను అందజేశారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. అలాగే విద్యుత్ బిల్లులకు నగదు అందజేశారు.

గురువుకు సన్మానం



వెంకటరమణారెడ్డిని సన్మానిస్తున్న పాఠశాల సమితి సభ్యులు

గూడూరు అర్బన్, జూలై 21: గురుపూర్ణిమ సందర్భంగా స్థానిక సరస్వతి శిశు మందిరంలో పాఠశాల సమితి ఆధ్వర్యంలో విశ్రాంత ఉపాధ్యాయుడు వెంకటరమణారెడ్డిని సన్మానించారు. ఈ సందర్భంగా సమితి సభ్యులు మాట్లాడుతూ అజ్ఞానంలో నుంచి జ్ఞానంలోకి నడిపించే శక్తి గురువుకే ఉంటుందన్నారు. భారతాన్ని రచించిన వ్యాసమహర్షి జయంతి సందర్భంగా గురువును సన్మానించడం తమ బాధ్యతగా భావిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రసాద్, వెంకటరమణయ్య, మయూరి శ్యామ్‌యాదవ్, రవిచంద్రారెడ్డి, రూపేష్‌రెడ్డి, ఆర్‌వీరావు, రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై గ్రామసభ



కలవకొండలో జరిగిన గ్రామసభ

చిల్లకూరు, జూలై 21: మండలంలోని ఉడతావారిపాళెం, కలవకొండ గ్రామాల్లో ఆదివారం సామాజిక తనిఖీల్లో భాగంగా 2023-24 సంవత్సరంలో జరిగిన ఉపాధి హమీ పనులపై అధికారులు, సామాజిక తనిఖీ బృందాల ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించారు. కవకొండలో రూ.98 లక్షలకు, ఉడతావారిపాళెంలో రూ.1.20 కోట్లకు పనులు జరిగాయని పనులకు సంబంధించి, కూలీలకు కూలి చెల్లింపులపై గ్రామసభలు నిర్వహించారు. ఇందుకు సంబంధించి అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో ఏపీవో గిరిబాబు, ఎస్‌ఆర్‌పీ రవి, ఆయా గ్రామాల సర్పంచులు, కూలీలు తదితరులు పాల్గొన్నారు.

జనసేన బలోపేతానికి కృషి

చిల్లకూరు, జూలై 21: ప్రతి ఒక్కరు సభ్యత్వాన్ని తీసుకుని జనసేన పార్టీ బలోపేతానికి కృషి చేయాలని జనసేన నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని చింతవరంలో చంద్రనీల్, ఇంద్రవర్ధన్, వెంకటకిరణ్‌కుమార్ తదితరులు సభ్యత్వ నమోదులో పాల్గొన్నారు.

చిరుద్యోగులపై కక్ష సాధింపు చర్యలొద్దు



బాలాయపల్లి ఆరోగ్య కేంద్రం వద్ద ఆందోళనలో ఏఐటీయూసీ నాయకులు

బాలాయపల్లి, జూలై 21: చిరుద్యోగులపై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎన్.చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఆశా కార్యకర్తను అక్ర మంగా తొలగించే చర్యలపై ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన ప్రభుత్వంలో చిరుద్యోగులపై ఎలాంటి కక్ష సాధింపు చర్యలు ఉండవని చెబు తున్నా స్థానిక నాయకులు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారన్నారు. మండలంలోని సుబ్రమణ్యం గ్రామంలో 18 ఏళ్లుగా కస్తూరి కృష్ణవేణి అనే దళిత మహిళ ఆశా వర్కర్‌గా పనిచేస్తోందని, స్థానిక నాయకులు ఆమెను తొలగించేందుకు అర్జీలు పెట్టి విచారణల పేరుతో వేధిస్తున్నారన్నారు. ఆశా వర్కర్ల సంఘ జిల్లా ప్రదాన కార్యదర్శి చాముండేశ్వరి, హైమావతి, ధనలక్ష్మి, సీపీఐ నాయకుడు మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాల్య స్నేహితుడికి చేయూత



నాయుడుపేట టౌన్, జూలై 21: తమతోపాటు స్కూల్‌లో చదువుకున్న మిత్రుడు అనారోగ్యం పాలవడంతో ఆదుకునేందుకు రూ.45వేలు సేకరించి అందించారు. 1982వ సంవత్సరం నాయుడుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టెన్త్ చదివిన సిరాజ్ అనారోగ్యం పాలవడంతో విషయం తెలుసుకున్న స్నేహితులు నగదు అందజేశారు. ఏ.శ్రీనివాసులు, అంకయ్య, ఎస్.మునిమనోహర్, కె.శ్రీనివాసులు, ఎం. బాలాజీ, సిద్ధయ్య, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మురుగునీటి కాలువల్లో పూడిక తీయండి



వెంకటగిరి టౌన్, జూలై 21: మున్సిపాలిటీలోని 14వ వార్డులో మురుగునీటి కాలువల్లో చెత్తాచెదారం పేరుకుపోయి మురుగు కదలడం లేదని, సంబంధిత పారిశుధ్య సిబ్బంది పట్టించుకోవడం లేదని వార్డు కౌన్సిలర్ శంకరయ్య మండిపడ్డారు. ఆదివారం ఆయన తోలిమిట్ట హనుమాన్ నగర్, నరసింహారావు వీధి, కోర్టు సెంటర్ తదితర ప్రాంతాల్లో మురుగునీటి కాలువలను పరిశీలించారు. వర్షాకాలం మొదలైన నేపథ్యంలో మురుగునీటి కాలువల్లో పూడిక తీయించాలని, చెత్తకుప్పలను తరలించాలని కోరారు.

గుర్రపుడెక్క తొలగించేది ఎప్పుడో?





గుర్రపుడెక్కతో నిండిపోయిన చల్లకాలువ - చెట్లతో కమ్ముకుపోయిన నాయుడు కాలువ - గుర్రపుడెక్క, పిచ్చిమొక్కలతో నిండిన దూడల కాలువ

గూడూరు, జూలై 21: వర్షాకాలంలో వరద నీరు పట్టణాన్ని చుట్టుముట్టకుండా సజావుగా కండలేరు క్రీక్‌లో కలసే పలు కాలువలు నేడు దుస్థితికి చేరుకున్నాయి. ప్రధాన కాలువ గుర్రపుడెక్కతో, కలుపు మొక్కలతో, చెట్లతో చిట్టడివిని తలపిస్తోంది. దీంతో వర్షపు నీరు సక్రమంగా పారకుండా ఎక్కడ పట్టణాన్ని ముంచెత్తుతుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. వర్షాకాలంలో, తుపానుల సమయంలో నీరు పట్టణాన్ని చుట్టుముట్టకుండా ఉండేలా చల్లకాలువ, దూడలకాలువ, పంబలేరు కాలువలు ఉన్నాయి. వర్షాలు అధికంగా కురిసిన సమయంలో ఎగువ ప్రాంతాల నుంచి, చెరువుల నుంచి వచ్చే నీరు చల్లకాలువ, దూడల కాలువ, పంబలేరు కాలువల మీదుగా పురిటిపాళెం సమీపంలోని జాతీయ రహదారి వద్ద ప్రవహిస్తున్న పంబలేరు వాగులో కలిసి కండలేరు క్రీక్ ద్వారా సముద్రంలో కలిసిపోతాయి. రాపూరు సహా ఎగువ ప్రాంతంలో నుంచి వర్షపునీరు గూడూరు మండలంలోని విందూరులో ఉన్న పంబలేరు కాలువ ద్వారా పంబలేరువాగులోకి, వెంకటగిరి, చెన్నూరు సహా ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే నీరు మర్రిపల్లిమడుగు, రావి చెరువు నుంచి చల్లకాలువ ద్వారా, గూడూరు చెరువు నిండిపోతే కలుజులనుంచి దూడల కాలువ ద్వారా పంబలేరువాగులో కలిసిపోతాయి. అయితే వర్షాకాలం సమీస్తున్న తరుణంలో ఈ కాలువలు గుర్రపుడెక్కతో నిండిపోయి ప్రవాహాన్ని అడ్డుకునేలా మారాయి. రావి చెరువు నుంచి వరదనీరు నాయుడుకాలువ ద్వారా గూడూరు చెరువుకు చేరుతుంది. ఈ నాయుడుకాలువ సైతం పిచ్చి చెట్లు మొలిచిపోయి నీటి ప్రవాహం సజావుగా సాగేందుకు అడ్డంకిగా మారింది. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ముందస్తు చర్యల్లో భాగంగా ఈ కాలువల్లో పూడిక తీయడంతోపాటూ చెట్టుపుట్టా తొలగించాల్సి ఉంది. ఎప్పుడూ వరదలు వచ్చినా చల్లకాలువ, పంబలేరుకాలువ నుంచి వచ్చే వరదనీరు అదే వేగంతో ముందుకు ప్రవహించలేక పట్టణాన్ని ముంచేస్తున్నాయి. దీంతో స్థానిక జనార్దన రెడ్డి కాలనీ, దూర్జటి నగర్ తదితర లోతట్టు ప్రాంతాలు ముంపుకు గురయ్యేవి. గూడూరుచెరువు నిండిన సమయంలో దూడలకాలువలో నీరు ముందుకు వెళ్లకపోవడంతో ఆర్టీసీబస్టాండు, విఘ్నేశ్వరపురం, వరదా నగర్ గిరిజన కాలనీ తదితర ప్రాంతాలు వరదనీటితో చిక్కుకుపోతాయి. యేటా ఇదే తంతూ జరుగుతున్నా గత వైసీపీ ప్రభుత్వం ముందస్తు నివారణ చర్యలకు చేపట్టలేదని స్థానికులు బాహాటంగానే చెబుతున్నారు. దీనికితోడు సంబంధిత శాఖ అధికారులు కూడా చర్యలు చేపట్టడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అంటున్నారు. ప్రస్తుతం చల్లకాలువ, దూడలకాలువ గుర్రపుడెక్కతో, కలుపు మొక్కలతో, నాయుడుకాలువ చెట్లతో నిండిపోయి ఉండడంతో ఎక్కడ నీరు పట్టణంలోని లోతట్టు ప్రాంతాలను ముంచెత్తుతుందోనని ఆందోళన చెందుతున్నారు. ఇకనైనా సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకుని కాలువల్లో పూడిక తీసి, గుర్రపుడెక్క తొలగించాలని గూడూరు పట్టణవాసులు కోరుతున్నారు.

జీఎన్‌టీ రోడ్డులో గుంతలు... పట్టించుకోని అధికారులు




సూళ్లూరుపేట, జూలై 21: పట్టణంలోని హోలిక్రాస్ కూడలి నుంచి తాజ్ పెట్రోల్ బంకు వరకు జీఎన్‌టీ రోడ్డు గుంతలతో అధ్వానంగా మారింది. ఈ రోడ్డు మీదుగా నెల్లూరు, చెన్నై వైపు వెళ్లే వాహనాలతో పాటు, ద్విచక్ర వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. దాదాపు కిలోమీటరు పరిధిలో పెద్దపెద్ద గుంతలతో వాహన చోదకులకు ఇబ్బంది తప్పడం లేదు. ఆర్‌అండ్‌బీ అధికారులు కనీస మరమ్మతులు చేపట్టకపోవడంతో ప్రయాణించలేని పరిస్థితి. దీనికి తోడు ఇటీవల కురిసిన వర్షాలకు గుంతల్లో నీరు నిలబడి ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు పట్టించుకుని కనీసం తాత్కాలిక మరమ్మతులైనా చేపట్టాలని స్థానికులు, వాహన చోదకులు కోరుతున్నారు.

నిలకడగా నిమ్మ ధరలు



గూడూరు అర్బన్, జూలై 21: గూడూరు నిమ్మ మార్కెట్‌లో నిమ్మ ధరలు నిలకడగా కొనసాగుతున్నాయి. ఆదివారం కిలో నిమ్మకాయలు రూ.80 పలకడంతో రైతుల్లో సంతోషం వ్యక్తం అవుతోంది. అడపాదడపా వర్షాలు కురుస్తున్నప్పటికీ ధరలు నిలకడగా కొనసాగుతున్నాయి. గత ఏడాది ఈ సమయంలో ధరలు పడిపోయాయి. అయితే ఈసారి మాత్రం ఆశాజనకంగా ఉండడంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. 50 కిలోల టిక్కీ రూ.4 వేలు, 80 కిలోల లూజు బస్తా రూ.6,400, పొడి, సన్నకాయలు టిక్కీ బస్తా రూ.2 వేలు పలికాయి.

శాస్త్రోక్తంగా మహా చండీయాగం



పూర్ణాహుతి పూజాసామగ్రితో కొండేపాటి గంగాప్రసాద్

సూళ్లూరుపేట, జూలై 21: తెలుగు, తమిళ భక్తుల ఆరాధ్య దైవమైన చెంగాళమ్మ ఆలయంలో ఆషాడ మాసం పౌర్ణమి సందర్భంగా ఆదివారం మహా చండీయాగం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని యాగశాల మండపంలో అమ్మవారి ఉత్సవ విగ్రహం ఏర్పాటు చేసి వేద పండితుల మంత్రోచ్చరణల నడమ యాగాన్ని నిర్వహించారు. టీడీపీ నేత కొండేపాటి గంగాప్రసాద్, కోమలి దంపతలు ఉభయకర్తలుగా వ్యవహరించారు. యాగం పూర్తయిన అనంతరం పూర్ణహుతి సమర్పించారు. ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట, వెంకటగిరి, గూడూరు ఎమ్మెల్యేలు విజయశ్రీ, కురుగొండ్ల రామకృష్ణ, సునీల్‌కుమార్, పెంచలకోన ఆలయ పాలకమండలి మాజీ చైర్మన్ తానంకి నానాజీ, మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రమణ్యం, టీడీపీ నేతలు టి.సుధాకర్ రెడ్డి, ఏ.రమేష్, ఏ.జీ.కిషోర్, జి.నారాయణ రెడ్డి, పెరుమాల్, బి.శ్రీధర్, సుదర్శన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గురుపూర్ణిమ వేడుకలు





గూడూరు పట్టణంలోని షిర్డీ ఆలయంలో సత్యవ్రతం - తడ పట్టణంలోని బాబా ఆలయంలో ప్రత్యేక అలంకరణ - ఓజిలిలో సాయినాథుడి గ్రామోత్సవం

గూడూరు, జూలై 21: పట్టణంలోని షిర్డీ సాయిబాబా మందిరంలో ఆదివారం గురుపూర్ణిమ వేడుకలను వైభవంగా నిర్వహించారు. బాబాను పలు రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. సాయి సత్యవ్రతం నిర్వహించిన అనంతరం పల్లకీసేవ చేపట్టారు. ● చిల్లకూరులో మండలంలోని అంకులపాటూరు, బల్లవోలులో సాయిబాబా ఆలయాల్లో గురుపూర్ణిమ సందర్భంగా సాయిబాబాను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. ● నాయుడుపేట పట్టణంలోని బ్రాహ్మణ వీధి, అగ్రహారపేటలోని షిర్డీ సాయిబాబా ఆలయాలలో వేకువజామునుంచే పాలాభిషేకాలు నిర్వహించారు. దీంతో భక్తులు పాలాభిషేకం కోసం క్యూలో బారులుతీరారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం కుంకుమార్చన, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ● వెంకటగిరి టౌన్ పట్టణంలోని పలు ఆలయాల్లో గురుపూర్ణిమ వేడుకలు జరిగాయి. కుమ్మరిగుంట వద్ద ఉన్న సాయిబాబా ఆశ్రమంలో సాయినాథుడికి ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. ● చిట్టమూరు, మల్లాం గ్రామంలోని సాయాబాబా మందిరాల్లో బాబాను ప్రత్యేకంగా అలంకరించారు. బాబా భక్తి గీతాలను భక్త బృందాలు ఆలపించారు. ● ఓజిలితోపాటు మానమాల, కురుగొండ, ఆరిమేనిపాడు, అత్తివరం, ఇనుగుంట తదితర గ్రామాల్లో గరుపౌర్ణమి వేడుకలను నిర్వహించారు. ఓజిలి, మానమాల, కురుగొండ గ్రామాలలోని సాయిబాబా మందిరం వద్ద అన్నదానం కార్యక్రమాలను చేపట్టారు. అంతకుముందు సాయినాథుడి గ్రామోత్సవాలను నిర్వహించారు. ● కోట పట్టణంలోని బాబా ఆలయంలో ఆలయ వ్యవస్థాపకులు సారంగం విజయభాస్కర్ ఆధ్వర్యంలో సాయి సత్సంగాలు, భజనలు జరిగాయి. అదే విధంగా విద్యానగర్, కోట, తిమ్మానాయుడునగర్, తదితర గ్రామాల్లో గురుపౌర్ణమిని పురస్కరించుకొని భక్తులకు అన్నదానం చేశారు. ● సూళ్లూరుపేట పట్టణంలోని కేఆర్‌పాలెం సాయి సన్నిధి సత్సంగ మందిరంలో ఉదయం బాబాకు పాలాభిషేకం చేసి ప్రత్యేక పూజలు చేశారు. మధ్నాహ్నం అన్నదానం చేశారు. రాత్రి చావడి ఉత్సవం వైభవంగా జరిగింది. ● తడ పట్టణంలోని సాయిబాబ ఆలయంలో నిప్పో కంపెనీ ఆధ్వర్యంలో మధ్నాహ్నం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిప్పో కంపెనీ ఎండీ ద్వారక నాధ రెడ్డి, కంపెనీ ప్రతినిధులు శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎస్ఈబీలో విలీనం చేయండి

ఎమ్మెల్యే విజయశ్రీకి ఎనర్జీ అసిస్టెంట్ల వినతి



నాయుడుపేట, జూలై 21: గ్రామ, వార్డు సచివాలయాల్లో ఎనర్జీ అసిస్టెంట్లుగా పని చేస్తున్న తమను ఏపీఎస్ఈబీలో విలీనం చేయాలని ఎమ్మెల్యే విజయశ్రీకి వినతిపత్రం అందజేశారు. 2019లో ప్రభుత్వం నిర్వహించిన ఎనర్జీ అసిస్టెంట్, జేఎల్‌ఎం గ్రేడ్-2లో రాష్ట్రవ్యాప్తంగా 7,329 మంది ఎంపికయ్యారని తెలిపారు. సచివాలయ సిబ్బందిగా ఉన్నప్పటికీ తాము ఏపీఎస్ఈబీలో విధులు నిర్వహిస్తున్నామని తమకు జీతాలను ఎలక్ట్రిసిటీ బోర్డు అందిస్తోందన్నారు. తమను సచివాలయ సిబ్బందిగా కాకుండా ఏపీఎస్ఈబీ రెగ్యులేషన్ ప్రకారం అసిస్టెంట్ లైన్‌మెన్‌గా పదోన్నతి కల్పించాలన్నారు. సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు.

దుస్థితిలో పెన్నక్క చెరువు కరకట్టలు





నెల్లూరుపల్లి కొత్తపాళెం వద్ద ఉన్న పెన్నక్క చెరువు - కొత్తపాళెం వద్ద, పల్లమాల వద్ద కోతకు గురైన చెరువు కట్ట

కోట, జూలై 21: వేలాది ఎకరాల రైతుల వరప్రసాదిని పెన్నక్క చెరువు దుస్థితికి చేరుకుంటున్నా అధికారులు పట్టించుకోవడంలేదు. మిచౌంగ్ తుఫాన్ దెబ్బకు చెరువు కర కట్టలు కోతకు గురైనాయి. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో ఎక్కడ చెరువు తెగిపోతుందోనని ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. కోట, చిల్లకూరు మండలాల రైతుల కల్పతరువుగా పెన్నక్క చెరువు కోట మండలం నెల్లూరుపల్లి కొత్తపాళెం నుంచి చిల్లకూరు మండలం పల్లమాల వద్ద ముగుస్తుంది. సుమారు 9 కిలోమీటర్ల మేర పొడవు ఉంటుంది. ఈ చెరువు కింద 9వేల ఎకరాలకు పైగా ఆయకట్టు ఉంది. చెరువు నీటి ఆధారంగా ఆయా భూములన్నీ వరి పుష్కలంగా పండుతుంది. నెల్లూరుపల్లి కొత్తపాళెం, పల్లమాల సమీపాలలో చెరువుకట్టలు కోతకు గురైనాయి. గత ఐదేళ్లలో కరకట్టలకు తాత్కలిక మరమ్మతులు చేపట్టలేదు. గండ్లు, కోతకు గురైన చోట రింగ్‌బండ్లు కూడా ఏర్పాటు చేయలేదు. ఈ ఏడాది తుఫాన్లు ఎక్కువగా రానున్నట్లు ఐఎండీ హెచ్చరికల నేపథ్యంలో పెన్నక్క చెరువు ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. మరమ్మతులు చేపట్టకపోతే చెరువు కట్టలు తెగి నీరు నిలబడదని ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుత పాలకులైనా స్పందించి మరమ్మతులు చేపట్టాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

కూరగాయల సాగుపై దృష్టి సారించండి



మహిళా రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న లక్ష్మీసాయి ప్రియ

వెంకటగిరి, జూలై 21: మహిళా రైతులు పెరటి తోటల సాగుపై దృష్టి సారించేలా కృషి విజ్ఞాన కేంద్రం అధికారులు అవగాహన కల్పించాలని టీడీపీ నాయకురాలు కురుగొండ్ల లక్ష్మీసాయిప్రియ అన్నారు. ఆదివారం కృషి విజ్ఞాన కేంద్రంలో కూరగాయల సాగుపై నిర్వహించిన శిక్షణ తరగతులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... గతంలో ఇంటి ఆవరణలో మహిళలు కూరగాయలు సాగు చేస్తుండే వారని, వాటితో ఇంటిల్లిపాదికీ అవే సరిపోయేవన్నారు. రానురాను బహిరంగ మార్కెట్లో కూరగాయలు కొనుగోలు చేస్తుండడంతో వాటి ధరలు ఆకాశాన్నంటుతున్నాయన్నారు. ఇంటి ఆవరణలోనే కాకుండా మేడలపై సేంద్రియ ఎరువులతో కూరగాయలు సాగుపై అవగాహన కల్పించారు. అనంతరం శిక్షణ పొందిన మహిళా రైతులకు ఉచితంగా విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్తలు గోవిందరాజులు, తిరుపాల్, నాగార్జున రెడ్డి, రాజీవన, వెంకటగిరి వ్యవసాయ మార్కెటింగ్ మాజీ చైర్మన్ పులికొల్లు రాజేశ్వరరావు, తెలుగుయువత రాష్ట్ర ఉపాధ్యక్షుగు కేవీకే ప్రసాద్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

చెంగాళమ్మకు బంగారు పూత వడ్డాణం వితరణ



సూళ్లూరుపేట, జూలై 21: చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారికి సూళ్లూరుపేటకు చెందిన సతీష్‌బాబు, సురేఖ దంపతులు ఆదివారం వడ్డాణాన్ని వితరణగా అందజేశారు. 198 గ్రాముల వెండికి 60 గ్రాముల బంగారు తాపడం చేసిన వడ్డాణాన్ని సహాయ కమిషనర్ వెంకటేశ్వర్లుకు అందజేశారు. ఎమ్మెల్యే విజయశ్రీ, మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రమణ్యం, పి.మురళిరెడ్డి, సుధా, టి.సుధాకర్ రెడ్డి, ఎ.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.25 కోట్లు

తిరుమల, జూలై21(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.4.25 కోట్లు లభించింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శనివారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈమేరకు రూ.4.25 కోట్లు ఆదాయం లభించినట్లు టీటీడీ ఆదివారం ఉదయం ప్రకటించింది. శనివారం 83,538 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు.

గుర్రప్ప స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

డక్కిలి, జూలై 21 : మండలంలోని తిమ్మాయపాళెంలోని గుర్రప్ప స్వామి ఆలయంలో ఆదివారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయ వద్ద పొంగళ్ళు పొంగించి స్వామి వారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. మోహరులోని సాయిబాబా మందిరంలో గురుపౌర్ణమి సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

భవన నిర్మాణ కార్మికులను ఆదుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

సూళ్లూరుపేట, జూలై 21: భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలని జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘ అధ్యక్షుడు సుంకర అల్లెయ్య అన్నారు. ఆదివారం సీఐటీయూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్మాణ రంగం కుదేలైందన్నారు. కూటమి ప్రభుత్వం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి కార్మికులను ఆదుకోవాలన్నారు. సాంబశివయ్య, సుధాకర్ రావు, లక్ష్మయ్య, వేణు, మునస్వామి తదితరులు పాల్గొన్నారు.

కోటమ్మకు పూజలు



కోట, జూలై 21: కోట గ్రామ దేవత కోటమ్మకు ఆదివారం విశేష పూజలు జరిగాయి. ఈ సందర్భంగా అమ్మవారికి పలు అభిషేకాలు చేసి చందన, పుష్పాలంకరణలో ఉంచారు. కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు, ఓజిలి మండలాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆయ మండలాల నుంచి భక్తులకు ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో తీర్థప్రసాద వినియోగం జరిగింది.